# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

డిసెంబర్ 2022

వెల : రూ. 5.00



# శ్రీ కాళీగార్డెన్స్‌లో శ్రీ దేవీనవరాత్రి ఉత్సవ దృశ్యములు



శ్రీ మాతాజీ వారిచే
దీక్షా స్వీకరణ



సత్సంగ సభ



కుంకుమ పూజలు

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 42 సంచిక 4
పేజీలు 44
డిసెంబర్ 2022

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

**బ్యాంక్ డ్రాఫ్టు** Y.S.C.K.P.M **చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా**

**మేనేజరు**

**సమర్థ సద్గురు మాగజైన్**

**శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు**

**గుంటూరు జిల్లా**

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


దాశరథీ శతకము ............................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట.................................... ............ 8

సంపద సంతృప్తి ..........................................10

అష్టమీచంద్రవిభ్రాజదళికస్థలశోభిత 13

అగస్త్య హృదయం ....................... ..............15

లక్ష్మీదేవి ..................... .......................................17

ఇసుక రాతలు ..................................................19

నేను ఎవరు? ....................... .......................20

శాంతం .......................... ................ ...........21

కొండాయార్య స్వామి ...............................25

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ....................27

వివేక చూడామణి ................ .................28

నిరీక్షణ ........................................................................30

ఆశ్రిత పారిజాతం ...........................................32

ఆశ్రమ స్వర్ణోత్సవ చిత్రమాలిక ..................34

అన్నదాన వైశిష్ట్యం ...........................................36

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ...... ............................ ...................41

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

29) **అండజవాహ నిన్ను హృదయంబున నమ్మినవారి పాపముల్**
**కొండలవంటివైన వెసగూలి నశింపకయున్నె సంతతా**
**ఖండలవైభవోన్నతులు గల్గకమానునె మోక్షలక్ష్మికై**
**దండయొసంగకున్నె తుద దాశరథీ! కరుణాపయోనిధీ!**

భావం - నిన్ను నమ్మి కొలచినవారి పాపములు కొండలంతటివైననూ నశించిపోవును. ఇంద్రవైభవములు కల్గను. మోక్షలక్ష్మి చేయూతనొసంగును దాశరథీ! కరుణాపయోనిధీ!




* పుట్టిన 12వ రోజునుండే మహిమలు చూపిందెవరు?
* మనం సముద్రంలాగా ఎందుకు బ్రతకాలి?
* జగన్మాతలో ఉన్న ఇద్దరు చంద్రులు ఎవరు?
* ఖాళీ గాదెలోనుండి బుట్టలకొలది గోధుమలు తీసి ఇచ్చినదెవరు?
* రాజుగారికి బంగారం మీద ఆశ ఎలా పోయింది?
* వేంకటేశ్వరస్వామి ప్రకాశానికి కారణం ఎవరు?
* శ్రీ బాబూజీ యాగాలు, పూజలు ఎందుకు చేశారు?
* నిన్ను బంధవిముక్తుని చేసే బంధం ఏది?
* బ్రిటీష్ రాజు పట్టాభిషేక సమయంలో ఏ తల్లి ఆశీస్సులు కోరుకున్నాడు?

*సమాధానాలు లోపలి పేజీలలో............................*

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

9-7-1981

ఈరోజు ప్రార్థన అయిన వెంటనే శ్రీ బాబూజీ దర్శనం ఇచ్చారు. బాబూజీ దర్శనార్థం శ్రీపురుషోత్తంగారు వచ్చారు.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ, "ఏమండీ పురుషోత్తంగారూ! ఇప్పుడు మీకు శాంతిగా ఉంది కదూ! మీరు పాపం ఆ కాలేజివాళ్ళకు డబ్బు ఇస్తామని వాగ్దానం చేశారు. ఆ ధనాన్ని మీ డిపార్ట్‌మెంట్‌లో చిట్‌ఫండ్ ద్వారా పొంది ఇవ్వాలని నిర్ణయించారు. మీ మాట నిలబెట్టు కొనటానికి మీరు నన్ను ప్రార్థించటం తమాషాగా ఉందండి. మీకు ధనాన్ని నేను అనుగ్రహించాలా? దానిని మీరు వేరే కాలేజీవాళ్ళకి డొనేషన్‌గా ఇస్తారా? బాగుందండి. మాకు అందజేసేవి మనోపుష్పాలా! వారికి యిచ్చేది ధనమా! ఇదెక్కడి న్యాయమండీ?" అని నవ్వుతూ అన్నారు.



పురుషోత్తంగారు శ్రీ బాబూజీ పాదాలకు నమస్కరించి "మీకు అందజేయవలసినది మీకు అందజేశాను" అన్నారు.

శ్రీ బాబూజీ నవ్వుతూ, "నేను డబ్బు ఏం చేసుకుంటానండీ? నేను ఎప్పుడైనా ఎవరివద్ద నుంచైనా ధనాన్ని ఆశించానా? సత్యగురువు ఎన్నడూ ధనాన్ని ఆశించడు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఈనాటికీ ప్రపంచ వ్యాప్తంగా ప్రకాశించటానికి కారణం ఏమిటండీ?" అని శ్రీబాబు భక్తులని ప్రశ్నించారు.

ఒక భక్తుడు సమాధానం చెపుతూ, 'అది ఆ దేవాలయం యొక్క యంత్రబలము' అన్నారు. శ్రీ బాబు కల్పించుకొని, "ఆ దేవాలయ నిర్మాణానికి తోడ్పడ్డ శిల్పి తన శిల్ప చాతుర్యము చేతనే ప్రకాశిస్తున్నాడని అనుకుంటున్నాడు. అలాగే స్వర్ణకారుడు తాను తయారుచేసిన రత్నాలు, వజ్రాల వలననే ఎక్కడ ఉండవలసినవి అక్కడ ఉండటం చేతనే

ప్రకాశిస్తూ అందరిని ఆకర్షిస్తున్నాడని అనుకుంటాడు. వాస్తు శాస్త్రవేత్త తన ప్రజ్ఞవలననే దేవాలయం దేదీప్యమానంగా వెలుగుతోందని అనుకుంటాడు. ఆగమ శాస్త్రకారుడు తాను సూచించిన యంత్రబలమే ఈ ప్రకాశానికి కారణం అని తలుస్తాడు. చేతికర్రతో జియ్యంగారు వచ్చి ఇదంతా తన ప్రజ్ఞే అనుకుంటాడు. తన యాజమాన్యంలో స్వామి కార్యక్రమాలు నిర్వహింపబడటం వలననే కదా! ఈ స్వామి విశ్వవ్యాప్తంగా ప్రకాశిస్తున్నారు అనుకుంటాడు. పురోహితులు తాము పఠించే మంత్రాల ఫలితమే ఈ ప్రకాశము అనుకుంటారు.

ఇవన్నీ కరక్టే. కాని ఈ శాస్త్రకారులందరికీ తమ శక్తిని ప్రదర్శించే శక్తిని ఇచ్చినది ఎవరు? ఈ శాస్త్రాలన్నీ యథార్థమే. కాని ప్రజ్ఞ ఎవరిది? ఆవెంకటేశ్వర స్వామియే వీరందరిలోనూ ప్రకాశించి వారి ద్వారా ఆ ప్రజ్ఞని ప్రదర్శించారు. ఆ ప్రకాశానికి తరుగు ఎక్కడిది?" అన్నారు. శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ, "మానవుడు రిటైర్ అయిన తర్వాత దైవచింతన చేద్దామనుకుంటాడు. తీరా రిటైర్ అయ్యాక ఇంకేదైనా ఉద్యోగం కోసం తపన పడతాడు.

ఒక లక్ష రూపాయలు సంపాదించిన తర్వాత ఆశ్రమంలో స్థిరపడదాం అనుకుంటాడు. బాల్యంలో బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ ఆటలలో ఉత్సాహంగా ఎగిరినంతగా ఇప్పుడు వయస్సు మీరిన తర్వాత ఎగరగలరా? ఎగిరితే ఏమవుతుంది? క్రిందపడితే ఇంక లేవలేడు.

అలాగే వార్థక్యం వచ్చిన తర్వాత తాను కూర్చోవటానికి ఓపిక ఉండదు. నామస్మరణ ఉచ్చరించలేడు. వినపడదు. ఇంక సాధన ఏం చేస్తారు? మనస్సు విషయాదులు, సంకల్పాలు, ఈర్ష్య, అసూయ, రాగద్వేషాల మధ్య సతమతమవుతూ ఉంటుంది. అటువంటి మనస్సుని అదుపులో ఉంచేవాడే గీతాచార్యుడు. ఆచార్యుని నమ్ముకున్నవారికి ఆయన అభయహస్త కిరణాలు వారి హృదయంలోనికి వ్యాప్తమై అజ్ఞానమనే చీకటిని తొలగించి పవిత్ర హృదయంగా మార్చివేశాయి. వారి హృదయంలోని భావాలు పవిత్రంగానే ఉంటాయి. అంతఃకరణ శుద్ధి జరుగుతుంది. **ఏకమేవ అద్వితీయం బ్రహ్మ** అని అందరిలోనూ ఆత్మనే చూడగలుగుతాడు. నాది, నేను అనే భావన పోయి తానెవరో తెలుసుకుంటాడు. ఆనందమే మిగులుతుంది" అన్నారు శ్రీ బాబు.

శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ, "మీకొక దృష్టాంతము చెప్తాను. దాస్ తల్లి స్వర్గస్థురాలయ్యారు.

'అమ్మా! పోయావా?' అని దాస్ విలపించాడు.

"ఎందుకయ్యా విలపిస్తున్నావు?" అంటే,

'అమ్మగారు స్వర్గస్థురాలయ్యారు' అని అన్నాడు దాస్.

'ఆవిడ స్వర్గస్థురాలైతే దుఃఖించటం ఎందుకయ్యా స్వర్గంలో అంతా సత్యమేగా. అలా విలపించకుండా అమ్మగారు స్వర్గస్థులైతే మరి ఇక్కడ ఉన్నది ఎవరు? అని విచారణ చేస్తే ఆనందమే తప్ప యింక ఏమీ ఉండదు.

మానవుడు అంతా నాదే అనుకుంటాడు. చివరకు తానేదీ కాదని తెలుసుకుంటాడు. ఈ కన్ను నేను కాదు, చెవి నేను కాదు, ఘ్రాణేంద్రియము నేను కాదు, జిహ్వేంద్రియము నేను కాదు, ఈత్వగింద్రియము నేను కాదు అని తెలుసుకుంటాడు.

శరీరంలో మనస్సు లేనిది ఎక్కడ? అలాగే ఆత్మవస్తువు లేనిది ఎక్కడ? జ్ఞాని సర్వత్రా ఆత్మవస్తువునే దర్శిస్తాడు. అందుచేతనే పిపీలికాది బ్రహ్మపర్యంతము జ్ఞాని దృష్టిలో సమానమే. అందరిని సమదృష్టితో చూస్తాడు. ఆత్మవస్తువు శబ్ద స్పర్శ రూప రస గంధాలకు అతీతమైనది.

బంగారంతో చేయబడిన వస్తువులు అనేకం ఉండవచ్చు. కాని అన్ని వస్తువులలో ఉన్న పదార్థ స్వరూపము ఒక్కటే. ఘటము అనే ఆవరణ ఉన్నంతవరకూ ఘటాకాశము ఉంటుంది. అది తొలగిపోతే మహాకాశములో కలిసిపోతుంది. ఘటము ఉన్నా లేకపోయినా మహాకాశము ఉంది.

మానవుడు తానెవరో తెలుసుకొనలేక ఎండమావుల్లో కపోత పక్షులవలె ప్రయాణంచేసి చివరకు పతనమవుతాడు. తానెవరో తెలుసుకుంటే తాను మహావాక్య స్వరూపుడౌతాడు.

అలా తెలుసుకొనక జీవితకాలాన్ని వృథా చేసినవాడు తిరిగి మానవ జన్మ పొందుతాడని నమ్మకంలేదు. వాడు గజ్జికుక్క అయి పుట్టవచ్చు, కుంటినక్క అయి పుట్టవచ్చు. కొండచిలువగా జన్మించవచ్చు. ఎవరు చెప్పగలరు?" అన్నారు శ్రీబాబు.

# అమ్మ మాట

- రమణ ప్రసాద్

## ప్రభు నీదు మహిమ తెలియుగ వశమా!

**హరి నీవే సర్వాత్మకుడవు, స్థిరమగు భావననీయగదే।**
**పారక మానదు పాపపు మనసిది ఈ రసములలో ఎందైనా,**
**నీరజాక్ష ఇది నీ మహిమేనని ఈ రీతుల తలపీయగదే।**

ఈ కీర్తనలో 'నీ మహిమే' అంటే అది భక్తి లక్షణం. 'నీ మయమే' అంటే అది జ్ఞాని లక్షణం. మనలో ఏదైనా ఆలోచన వస్తే, ఆ ఆలోచనలో ఆయనే ఉన్నాడు అనే భావన రావాలి. నీలో ఉన్నవాడు ఎవరు? పరమాత్మ . ఆయనే నా ఉనికికి కారణం అనే భావన స్థిరమైతే నీలో కలిగే ఆలోచనలు, నువ్వు చూసే దృశ్యాలు, నువ్వు వినే ధ్వనులు ఆ పరమాత్మునివే అని గ్రహిస్తావు. చర్మ చక్షువులతో ఎన్నో చూస్తాం. చెవులతో ఎన్నో వింటాం. ఇదంతా ఆ భగవంతుని లీల అని



గుర్తిస్తే, నీలో చెడు ఆలోచనలు, చూడకూడని దృశ్యాలు, వినరాని మాటలు రావు. మంచి ఆలోచనలే వస్తాయి. మంచినే చూస్తావు. మంచినే వింటావు. చలించే మనస్సును పరమాత్మపై నిలపడమే ధ్యానం. అటువంటి పరమపదానికి చేర్చేవారే మహాత్ములు.

రత్నాకరుడు ఒక దోపిడీదొంగ. నారద మునీంద్రుల వారి కృపా దృష్టి అతనిపై పడింది. నారదులవారు అతనిని ఒక ప్రశ్న అడిగారు-"నువ్వు చేసేది పాపకార్యం ఇందులో నీ భార్యాబిడ్డలు పాలు పంచుకొంటారేమో కనుక్కొని రా" అన్నారు. వారు "నీ పాపంతో మాకేమీ సంబంధం లేదు. భార్యాబిడ్డలను పోషించటం భర్తగా అది నీ కర్తవ్యం" అన్నారు. రత్నాకరుడు నారదుని కాళ్లపై పడి శరణు వేడాడు. ఆయన, "రామ" అనే మంత్రాన్ని జపించమన్నాడు. అతనికి నోరు తిరగలేదు. అక్కడ మఱ్ఱిచెట్టును చూపించి "మరా" అని జపించమన్నారు. మరా మరా అంటే అది రామ రామ అయింది. ఆ చెట్టు క్రింద కూర్చుని అహర్నిశలు రామ మంత్రం జపించాడు. ఆయన మీద వల్మీకాలు (పుట్టలు) లేచాయి. అందువలన ఆయన 'వల్మీక మహర్షి' అని పిలువబడ్డాడు. శ్రీమద్రామాయణ కావ్యాన్ని రచించి ఆదికవిగా రాణించాడు.

మనం ఆశ్రయించిన సద్గురువుల అనుగ్రహం పొందాలంటే మొదట ప్రాపంచిక దృష్టి వదలి భగవద్దృష్టి అలవరచుకోవాలి. అహర్నిశలు ధ్యానం చేస్తూ ఉంటే, నీ మనస్సు ఉన్నత స్థితిలోకి పోతుంది. మనస్సు నిర్విషయమవుతుంది. నీ మనస్సులోని మలాన్ని తొలగించుకో! మితాహారం దేహ రక్షణ కొరకే తీసుకో! అప్పుడు నువ్వు ముక్తుడవుతావు. జనన మరణ వలయాన్నుంచి బయటపడతావు. ఈ ముక్తస్థితి బ్రతికుండగానే పొందాలి.

**పిబరే రామ రసం రసనే పిబరే రామ రసం।**

"ఓ మనసా! రామరసాన్ని త్రాగు'. అది ఎంత తాగినా వెగటు పుట్టదు. ఈ నామం సకల శాస్త్ర నిగమాల సారం. నిన్ను జనన మరణ శోకాలనుండి దూరం చేసి ముక్తిని ప్రసాదిస్తుంది.

తనలో ఉన్న 'తాను'ను గుర్తింపజేసి, తానెవరో తెలిసికొనే అమృత స్థితి సద్గురుదేవుల సమాశ్రయం వలనే లభిస్తుంది. మనం సమర్థులైన గురుదేవులను ఆశ్రయించే ఉన్నాం. శ్రీగురుదేవులు మనందరికీ అట్టి శక్తిని భక్తిని ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదించెదరు గాక సుఖీభవ!

### పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**డిసెంబర్ 2022**

7 బుధ -మార్గశిర పూర్ణిమ - దత్తజయంతి - శ్రీసద్గురుపాదపూజ

17 శని - ధనుర్మాస వ్రత ప్రారంభం

18 ఆది - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

**జనవరి 2023**

2 సోమ - ముక్కోటి ఏకాదశి - శ్రీ సద్గురు పాదపూజ

6 శుక్ర - పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

14 శని - భోగి పండుగ, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం - శ్రీ సద్గురు పాదపూజ

15 ఆది - సంక్రాంతి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

17 మంగళ - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

# సంపద - సంతృప్తి

- సుషమ్నా ప్రసాద

సాధారణంగా మానవునికి దేనివలన ఆనందం, శాంతి లభిస్తుందంటే, వెంటనే వచ్చే సమాధానము సంపద వలన అంటాడు. కానీ, సంపద వలన శాంతి లభిస్తుందనుకోవటం ఎండమావులలో నీరు త్రాగి, దాహం తీర్చుకోగలమనే భ్రాంతి లాంటిదే. మానవునికి ప్రమాదకరమైన ప్రతిబంధకాలు కామినీ కాంచనములపై వున్న వ్యామోహమే. మానవుని పతనానికి దారితీస్తాయి. కనుక సంపద అనేది సంతృప్తికి సంకేతం కాదు. శాంతి లేనిది సుఖము లేదని ప్రతి వ్యక్తికి తెలుసు. కాని అహంకార, మమకారములనే సంకెళ్లల్లో బంధింప బడ్డ మానవుడు ధనమే సర్వస్వము అనుకుంటాడు. కానీ, ఆ ధన వ్యామోహమే, తన పతనానికి ప్రథమ సోపానమని గ్రహించలేక తన వుచ్చును తానే బిగించుకుంటాడు. ఎవరైతే గురుకృపకు పాత్రులై, సద్గురువు ఆదేశానుసారము తమ జీవితాన్ని మలచుకుంటారో, వారు సంతృప్తికి మించిన సంపద లేదని గ్రహించి తరిస్తారు.

సంపద మీద మితిమీరిన వ్యామోహం పెంచుకున్న వానికి సంతాపమే మిగులుతుంది. అందుకు ఒక మహారాజు కథయే తార్కాణము. పూర్వము పాశ్చాత్య దేశంలో మిడాస్ అనే చక్రవర్తి పరిపాలించేవాడు. ఆ చక్రవర్తికి సంపద, సౌభాగ్యం, ఆర్భాటాలు వీటికి కొదవ లేదు. కావి ఆ మిడాస్‌కు సంతృప్తి కరువైంది. ప్రపంచంలో యావన్మంది కంటే తానే సంపన్నుడు కావాలని, దానివలన మహదానందాన్ని పొందగలననే భ్రాంతిలో మునిగిపోయాడు. అలా అపర కుబేరుడిలాగా రూపొందాలనే అత్యాశతో, కఠోర తపస్సు చేశాడు. ఆ తపస్సుకు మెచ్చి భగవంతుడు ప్రత్యక్షమై నీకు ఏం కావాలో కోరుకో అన్నాడు. వెంటనే మిడాస్ నేను ఏది తాకితే అది బంగారమైపోవాలని కోరాడు.

అప్పుడు భగవంతుడు చిరునవ్వుతో నేను నీ మేలు కోరి చెబుతున్నాను నీ ఈ కోరిక నీ పతనానికి దారి తీస్తుంది. ఆనందానికి బదులుగా నీకు ఆందోళన మిగులుతుంది. కాబట్టి వేరే ఏదైనా కోరిక కోరుకోమని చెప్పాడు. కానీ, మిడాస్ ఆ బంగారం మీద వున్న ఆశ

కొద్దీ భగవంతుని ప్రేమపూర్వక, అనుగ్రహభరితమైన సందేశాన్ని పెడచెవిని పెట్టి, తానేమి స్పృశించినా బంగారం కావాలన్న దురాశతో తన పతనాన్ని తానే కొని తెచ్చుకున్నాడు. భగవంతుడు సరే అని అతనికి ఆ వరాన్ని ప్రసాదించి అదృశ్యమైపోయాడు.

వెంటనే మిడాస్ చక్రవర్తి తాను చాలా కాలం నుండి నిద్రాహారాలు వర్జించి, తపస్సు చేశాడేమో వెంటనే చాలా దాహం వేసింది. పనివాడికి చెప్పగా పాత్ర నిండా నీరు నింపి రాజుగారికిచ్చాడు. చక్రవర్తి ఆ పాత్ర మీద చేయి వేయగానే ఆ పాత్ర, ఆ పాత్రలోని నీరు కూడా బంగారంగా మారిపోయాయి. పోనీ భోజనం చేద్దామని షడ్రసోపేతమైన భోజనం సిద్ధం చేయమన్నాడు. తీరా తిందామని కంచం దగ్గరకు వచ్చి చేయి వేయగానే అన్నం కంచంతో సహా బంగారమైపోయింది. అయ్యో! మంచినీళ్ళు తాగుదామంటే బంగారమైపోయింది, పోనీ అన్నం తిందామంటే అది కూడా బంగారమైపోయింది!! కనీసం పడుకుని నిద్రపోదామని మెత్తటి పరుపులు పరచి పక్క సిద్ధం చేయమని ఆజ్ఞాపించాడు. హాయిగా పడుకోవాలనే తీవ్రమైన కోరికతో మెత్తటి పరుపుమీద చక్రవర్తి నడుం వాల్చగానే అది పరుపుతో సహా బంగారంగా మారిపోయింది. ఇహ చేసేదేమీ లేక రాణీగారితో కలసి నేలమీదే పడుకుందామని నిర్ణయించుకుని ఆ మహారాణిపై ప్రేమగా చేయి వేసేసరికి సౌందర్యరాశి అయిన ఆ భార్య కూడా బంగారు బొమ్మగా మారిపోయింది.

వెంటనే దిగ్భ్రాంతికి లోనై కాంచనముపై విపరీతమైన మోజు, భ్రాంతి కాటికే దారి తీస్తుందని గ్రహించాడు. సంపద హద్దులు దాటితే సంతాపానికే దారితీస్తుంది, శాంతి సౌఖ్యాలు కరువైపోతాయని తెలుసుకున్నాడు. భగవంతుడిచ్చిన సలహాను పెడచెవిని పెట్టినందుకు తగిన ఫలమే లభించిందని గ్రహించాడు. వెంటనే చేసిన తప్పును సరిదిద్దుకునేందుకు తిరిగి తపస్సు ప్రారంభించాడు మిడాస్ చక్రవర్తి. ఘోర తపస్సుకు ఫలితంగా భగవంతుడు మరల ప్రత్యక్షమై చిరునవ్వుతో 'నీకు ఏం వరం కావాలి?' అని అడిగాడు. మిడాస్ 'పరమేశ్వరా! నీ మాటను పెడచెవిని పెట్టినందుకు నా తప్పిదాన్ని క్షమించి, నీవిచ్చిన ఆ వరాన్ని వుపసంహరించు' అని ప్రార్థించాడు. ఎందుకలా? అని అడిగాడు

భగవంతుడు. మిడాస్ మాట్లాడుతూ, 'స్వామీ! నేనింతకాలమూ కాంచనమే సంతోషానికి సంకేతం అనుకున్నాను. కానీ, ఇప్పుడు అనుభవ పూర్వకంగా కాంచనంపై తృష్ణ, మానసిక వ్యథ, కల్లోలానికి దారి తీస్తుందనే నగ్న సత్యాన్ని గ్రహించాను. సంతృప్తిని మించిన సంపద మరేదీ లేదు. సంతృప్తియే శాంతి సుఖాలకు నిలయమనే అక్షర సత్యాన్ని గ్రహించాను' అని వినయ పూర్వకంగా చెప్పాడు. కాబట్టి తృప్తిని మించిన సంపద లేదని గ్రహించడమే జీవిత పరమావధి!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**డిసెంబర్ 2022**

3 శని - శ్రీగురుదేవులు స్వస్వరూపలయం చెందిన తేదీ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

4 ఆది - గీతాజయంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

7 బుధ - మార్గశిర పూర్ణిమ - దత్త జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

17 శని - ధనుర్మాస వ్రత ప్రారంభం

18 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

25 ఆది - క్రిస్మస్ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

**జనవరి 2023**

1 ఆది - ఆంగ్ల సంవత్సరాది -సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

2 సోమ - ముక్కోటి ఏకాదశి- సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

6 శుక్ర - పుష్య పూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

14 శని - భోగి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట

15 శని - సంక్రాంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

17 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

26 గురు - శ్రీ సద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా అష్టమ వార్షికోత్సవము (2015 మాఘశుద్ధ పంచమి) - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

28 శని - రథసప్తమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

# అష్టమీచంద్రవిభ్రాజదళికస్థలశోభిత

- హనుమత్ జయప్రద

**అష్టమీచంద్రవిభ్రాజదళికస్థలశోభిత -**

అష్టమి తిథి నాటి చంద్రుని వలే ప్రకాశించుచున్న ఫాల (నుదురు)భాగముచే అలౌకికమైన సౌందర్యముతో ప్రకాశించుచున్నది అని అర్థం. ఈ నామంలో అమ్మవారి యొక్క ఫాలభాగము, అష్టమినాటి చంద్రుడితో పోల్చబడింది. అయితే మనకి ఒక సందేహము వస్తుంది. ఒక మాసములో రెండు పక్షములు వుంటాయి, కృష్ణ పక్షము, శుక్లపక్షం. ఈ రెండు పక్షములలో అష్టమి తిథి వస్తుంది. మరి అమ్మవారి ఫాలభాగము ఏ అష్టమి తిథిని పోలి ఉంటుంది? అని. కృష్ణపక్షము లోని అష్టమి తిథి ( ఇన్‌వర్టెడ్ యూ - అర్ధవృత్తాకారం) ఆకారములో వుంటుంది. శుక్లపక్షంలో వచ్చే అష్టమి చంద్రుడు యూ ఆకారములో ఉంటాడు. ఈ రెండింటిని కలిపితే పూర్ణచంద్రుడు అవుతాడు. అమ్మవారి యొక్క ఫాలభాగము కృష్ణపక్షములోని అష్టమి తిథి లోని చంద్రుడు (ఇన్వర్టెడ్ రేఖ).

శ్రీబాబూజీ మహారాజ్ అర్ధచంద్రాకార (అర్ధవృత్తాకారం) ఆకారములో లలాట స్థానములో తమయొక్క తిలకముని పెట్టుకుంటారు. ఈ రెండిని కలిపి చూసినప్పుడు ఒక పూర్ణమైన చంద్రబింబం మనకి కనిపిస్తుంది. శ్రీ గురుదేవులు పరిపూర్ణ స్వరూపులు. జగన్మాత స్వరూపము (కాళీ సమం సద్గురుమ్), పూర్ణత్వాన్ని ప్రస్ఫుటితంగా తమ యొక్క నుదిటి మీద తిలక రూపంలో, అమ్మకి నాకు భేదం లేదు, ఇద్దరమూ ఒక్కటే అనే ఒక అనుభూతిని అందిస్తున్నారు. దీనికి ఒక ప్రమాణం ఏమిటి అంటే, ఆదిశంకరులు రాసిన సౌందర్యలహరిలో

**లలాటం లావణ్యద్యుతివిమలమాభాతి తవ య-**
**ద్ద్వితీయం తన్మన్యే మకుటఘటితం చంద్రశకలమ్**
**విపర్యాసన్యాసాదుభయమపి సంభూయ చ మిథః**
**సుధాలేపస్యూతిః పరిణమతి రాకాహిమకరః**

దీని అర్థం : అమ్మా! లావణ్యమయిన వెన్నెల కాంతిచే నిర్మలమైన నీ లలాటము చంద్రుని యొక్క ఒక అర్ధచంద్రాకారము అయితే, రెండవ అర్ధచంద్రాకారము నీ కిరీటంలో ఉన్నటువంటి చంద్రలేఖగా నేను భావిస్తాను. ఈ రెండింటిని కలిపి చూసిన పౌర్ణమి నాటి చంద్రునిగా పరిణమిస్తున్నవి కదా! (ఆదిశంకరారుల భావం, ఒక చంద్రలేఖ అమ్మ యొక్క ఫాలభాగం అయితే రెండవ చంద్రలేఖ అమ్మ యొక్క

కిరీటమునందున్నది. రెండింటిని కలిపి చూసినప్పుడు ఒక పూర్ణ చంద్రబింబం మనకి అమృతమయమైన ఆనందాన్ని ఇస్తుంది అని.)

ఎవరైనా ప్రశాంతముగా ఉన్నారా లేక చికాకుగా ఉన్నారా అనే విషయము మనకు ప్రస్ఫుటము అయ్యేది నుదుటి భాగం లోనే. ప్రశాంతంగా ఉన్నపుడు నుదురు మామూలుగా ఉంటుంది, చికాకుగా ఉన్నప్పుడు నుదురు ముడుత పడుతుంది. అమ్మవారి నుదురు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండి తనను నమ్మిన భక్తులకి ప్రశాంతమైన జీవితాన్ని అనుగ్రహిస్తుంది .

ఈ నామములో మరొక అర్థము కూడా ఉన్నది. ఆమె ఫాల భాగం చాల విశాలమైనది. సాముద్రిక శాస్త్రం ప్రకారం విశాలమైన ఫాలభాగం ఒకగొప్ప లక్షణం. కాబట్టే ఆ తల్లి ఎప్పుడూ ప్రసన్న వదనంతో తన బిడ్డలను కరుణిస్తూ ఉంటుంది. మనం చేయవలసిందల్లా అమ్మను నిరంతరం తలుచుకోవడమే. జగన్మాత లలితా త్రిపురసుందరి పదహారుకళలు కలిగిన పరిపూర్ణ స్వరూపము. అందుకే ఆమెకు షోడశి అని పేరు వచ్చింది. చంద్రకళలకు, అమ్మవారి కళలకు ఏంతో పోలిక ఉన్నది ."**సర్వవిజ్ఞాన తేజమునె చంద్రకళగా శిరమున గల మహేశ్వరివి నీవే...**"

చంద్రుని లోని పదహారు కళలు శ్రీవిద్యలో పదహారు నిత్యల పేర్లతో సంకేతించడం జరిగింది. ఆ పదహారు తిథుల చంద్రకళలను, వాటికి సంబంధిన అమ్మవారి తిథినిత్యదేవతలలో అష్టమి నాటి అమ్మ పేరు త్వరితా దేవి. (**త్వరితా త్వరితఫలదాయిని** -త్వరగా ఫలితమును ఇస్తుంది అని అర్థం). కృష్ణపక్ష అష్టమి, శుక్ల పక్ష అష్టమి నాడు ఒక్కరే తిథి నిత్యదేవత, ఆవిడే త్వరితగ కొలుచుకోబడుతోంది. ఈ త్వరిత అనే నిత్య, అష్టమి నాడు రెండు పక్షములలో రావడంలో అర్థం ఏమిటి అంటే, ఆ తిథి స్వయముగా అమ్మవారి ఫాలభాగమే. అలాంటి కృష్ణపక్ష అష్టమి నాటి చంద్రరేఖను మనము దర్శించగలిగితే, అమ్మవారి ఫాలభాగమును దర్శించినట్టే. అష్టమి నాటి చంద్రదర్శనం కోసం మనం ఆగవలసివస్తుంది ఏమో కానీ, మన ఇంట ఉంటూ, మనలోనే ఉంటూ, మనతోనే వుంటూ, మన వెన్నంటి నడిపించే శ్రీ గురుచంద్రులను, స్వామి యొక్క లలాట స్థానమునందు ఉన్న తిలకమును దర్శించడం, అష్టమి నాటి చంద్రదర్శనం కన్నా కూడా గొప్పదైన మధురానుభూతిని ఇస్తుంది. అటువంటి ఆనందాన్ని మించిన ఐశ్వర్యం మరొకటి ఉండదు కదా!

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**వేదాశ్చ క్రతవశ్చైవ క్రతూనాం ఫలమేవచ ।**

**యాని కృత్యాని లోకేషు సర్వ ఏష రవిః ప్రభుః ॥**

తాత్పర్యము - ఈయనే వేదవేద్యుడు. సర్వ క్రతువులకూ క్రతు ఫలములకు ఆధారమైన యజ్ఞ స్వరూపుడు. లోకములో జరిగే సర్వ కార్యములకూ ప్రభువు ఆ సూర్య భగవానుడే! ఈ శ్లోకము ద్వారా అగస్త్యులు ఆదిత్యుడిని సర్వక్రతువులకు సాక్షిగా, సర్వ కార్యములకు ఆధారముగా వర్ణిస్తూనే గుహ్యముగా వేదవేద్యులు, యజ్ఞఫల ప్రదాత మరియు సర్వాధార స్వరూపులైన గురు పరమాత్మను తెలియజేస్తున్నారు.

**వేదాశ్చ క్రతవశ్చైవ** అంటూ ప్రథమంగా గురుదేవులను వేద స్వరూపులుగా ఆవిష్కరిస్తున్నారు. **వేదాంత కృత్ వేదవిదేవచాహం** అంటూ నేనే వేద స్వరూపుడనూ, వేదములని రచించినది, వాటిని తెలుసుకోవడం వలన తెలియబడేదీ నేనే అన్న జగద్గురువుల వివరణ కూడా అదే కదా! తెలుసుకోవడమూ, తెలియబడటమూ అన్నవి సర్వాధిష్టానులైన గురుదేవులు ప్రసాదించిన చిచ్ఛక్తి వలననే అని సాధకులు నిరంతరమూ మరువరాదని అగస్త్యుల సూచన.

**క్రతూనాం ఫలమేవచ** అన్న సంబోధన ద్వారా గురుదేవులు కర్మాచరణతో పాటుగా కర్మరాహిత్యమును ఎలా కలిగిస్తారో వివరిస్తున్నారు. శ్రీబాబూజీ మహరాజ్‌వారు స్వయంగా పూజలను సలుపుతూ భక్తులతో పూజలనూ, క్రతువులనూ, యాగములనూ జరిపిస్తున్న సందర్భములో కొంతమంది 'వేదస్వరూపులు, వేదవేద్యులైన మీకు ఈ కర్మలెందుకు బాబూ?' అని ప్రశ్నిస్తే, శ్రీబాబు 'నేను ఆచరించినప్పటికి కూడా మీరందరూ వాటి విలువను తెలుసుకోలేక పోతున్నారు. అలాంటిది నేనే చేయకపోతే ఆ పూజలలో, క్రతువులలో వున్న ఫలాన్ని మీరెలా పొందగలరని' శెలవిచ్చారు. ఆ విధంగా మనతో క్రతువులను జరిపిస్తూ ఆ ఫలములను మనకు ప్రసాదించే గురుదేవులను మనం ఆర్తిగా **ఓం క్రతు కర్త్రే నమః , ఓం క్రతు భోక్త్రే నమః, ఓం యజ్ఞఫల ప్రదాయ నమః** వంటి నామాలతో స్తుతించుకుంటాం కదా!

ఈ ఆరాధనలలో ఆశ్రమ స్వర్ణోత్సవాలలో సద్గురుదేవులు మనందరితో జరిపిస్తున్న **శ్రీ సద్గురు విశ్వశాంతి పాశుపత వజ్రగ్రథిత మహా మృత్యుంజయ సంపుటిత రుద్రయాగము** దీనికి ఒక ఉదాహరణ. అయితే ఈ యజ్ఞకర్మలకే పరిమితమవకుండా సాధనలో ముందుకు సాగాలని

**స్వాధ్యాయ ధ్యాన యజ్ఞాశ్చ యతయః సంశ్రిత వ్రతాః** అని చెప్పినట్లు మనందరితో నిరంతర స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞములను సత్సంగము, విచారణ ద్వారా శ్రీబాబు అందిస్తున్నారు. ఇక వాటిని ఆచరించి ఫలితమును ఆస్వాదించడం మన వంతే కదా!

**యాని కృత్యాని లోకేషు సర్వ ఏష రవిః ప్రభుః** అన్న సంబోధన పైకి సూర్య భగవానుని గురించి అన్నట్లు కనిపిస్తూ గుహ్యంగా సర్వ కార్యములకు ఆధారభూతుడైన ప్రభువుగా సద్గురుదేవులను ప్రతిపాదిస్తోంది. శ్రీబాబూజీ మహరాజ్ కార్య నిర్వహణలో విధులను విస్మరించక ఒక పాదంపై ఎడమ చేతిని వుంచి కార్యములను పూర్తి చేసి కుడిచేతిని కూడా రెండవపాదముపై చేర్చమంటూ మహాప్రబోధమును సులభముగా అందించారు. చేతితో పట్టుకొన్నప్పుడు సద్గురు పాదస్పర్శను ఎలా మరువలేమో అదే విధంగా జరుగుతున్న ప్రతి కార్యము వెనుక నా గురుదేవులు వున్నారన్న ఎరుకని కలిగి వున్నప్పుడు ఆ కార్యము సద్గురు పాదపూజతో సమానమని ఈ బోధ వెనుక అంతరార్థము. అదే విధంగా లోకంలో జరిగే ప్రతికార్యము వెనుక ప్రభువైన తన గురుదేవులను చూడ గలగాలని ఈ శ్లోకము తెలియజేస్తోంది.

ఈ శ్లోకము ఆదిత్య హృదయం స్తోత్ర భాగములో చివరగా చెప్పబడింది. తదుపరి శ్లోకం నుండి ఫలశ్రుతి మొదలవుతుంది. అందుకే అగస్త్యులు అన్ని శ్లోకముల సారమును ఇందులో ఇనుమడింప చేశారేమో అనిపిస్తుంది. భగవద్గీత చివరిలో జగద్గురువులు చేసిన బోధకూ సారూప్యం కనిపిస్తుంది. **సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః** అని అంటూ అన్ని ధర్మములనూ వదలి, శరణాగతి చేసి, నీ కర్తవ్యమును నిర్వర్తించమన్న బోధ ఈ శ్లోకంలో దాగివున్నది. ఆత్మపూజ చివరిలో **యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం స్వామీ తవారాధనం** అని వివరించినట్లు ప్రతి కర్మనూ నిర్వర్తించగల శక్తిని తన గురుదేవులే ప్రసాదిస్తున్నారన్న భావనతో పాటుగా ఆ కర్మలను గురుదేవుల ఆరాధనగా భావించాలన్న శంకరుల తత్వమే ఈ శ్లోకంలో దర్శనమిస్తుంది. శ్రీబాబూజీ శెలవిచ్చినట్లు ప్రతికార్యము వెనుక వున్న గురుశక్తిని గుర్తిస్తూ, ప్రతి కార్యమునూ గురుకార్యముగా భావించడమే సాధకులైన మనందరి కర్తవ్యం!

# లక్ష్మీదేవి

- పాలూరి కాళీప్రసాద్

నిరాకార పరబ్రహ్మ స్వరూపిణి అయిన జగన్మాతను మనం నవరాత్రి ఉత్సవాలలో సాకారంగా వివిధ ఆకృతులలో పూజించుకుంటూ ఉంటాం కదా! అందులో ముఖ్యమైన మూడు ఆకృతులు ముగురమ్మలుగా పిలువబడే మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి. ఇందులో మహాకాళి రూపిణి అయిన పార్వతీ/దుర్గా దేవి గురించి మనం అనేక కథలు దేవీభాగవత రూపంలో ఆ పదిరోజులూ వింటూనే ఉన్నాం. అలాగే సరస్వతీదేవి గురించి కూడా మూలానక్షత్రం రోజున మనం విశేషంగా చెప్పుకుంటాం. అయితే లక్ష్మీదేవి గురించి మాత్రం మనం అంతగా చెప్పుకోం. ఆధ్యాత్మిక సాధనలో ఉన్న మనకు ఐశ్వర్యంతో పెద్దగా పనిలేదని ఒక ఆలోచన కావచ్చు.

అయితే లక్ష్మీ కటాక్షం కేవలం సంపదకు మాత్రమే కాదు. మనం కడుపునిండా అన్నం తినగలుగుతున్నాం అంటే అది ధాన్యలక్ష్మి కటాక్షం. ఆ అన్నం సంపాదించుకోవడానికి కావలసిన చదువు అబ్బిందంటే అది విద్యాలక్ష్మి కటాక్షం. అలాగే ధనలక్ష్మి, ధైర్యలక్ష్మి, సంతానలక్ష్మి ఇలా ఈ సృష్టిలో మనకున్నవన్నీ ఆ తల్లి దయవలన కలిగినవే. వీటన్నిటికన్నా వుత్కృష్టమైనది, మనం కాంక్షించవలసినది మోక్షలక్ష్మి అనుగ్రహం.

**ఈశానాం జగతోస్య వేంకటపతేర్విష్ణోః పరాం ప్రేయసీం**
**తద్వక్షస్థల నిత్యవాస రసికాం తత్ క్షాంతి సంవర్ధినీం**
**పద్మాలంకృత్య పాణి పల్లవ యుగాం పద్మాసనస్థాం శ్రియం**
**వాత్సల్యాది గుణోజ్వలాం భగవతీం వన్దే జగన్మాతరం॥**

**ఈశానాం జగతోస్య వేంకటపతేర్విష్ణోః పరాం ప్రేయసీం** - ఈ జగత్తు అంతటికీ ఈశ్వరుడై వేంకటపతి అయిన విష్ణువుకు అత్యంత ఇష్టురాలు ఆ తల్లి. ఎంతటి ప్రేయసి అంటే - వేదరూపంలో ఉన్న విద్యాలక్ష్మిని సోమకాసురుడు అపహరిస్తే స్వామి మత్స్యావతారం ఎత్తాడు.

దూర్వాసుని శాపంతో ఇంద్రుని వద్దనున్న ధనలక్ష్మి అంతా సముద్రం పాలైపోతే తిరిగి ఆ తల్లిని పొందటం కోసం కూర్మావతారం ఎత్తాడు.

భూమాత రూపంలో ఉన్న ధాన్యలక్ష్మిని హిరణ్యాక్షుడు బాధిస్తుంటే

వరాహావతారం ఎత్తాడు. చెంచులక్ష్మి రూపంలో ఉన్న అమ్మను పొందటానికి నరసింహావతారం ఎత్తాడు. ముల్లోకాల సంపద రూపంలో ఉన్న ఐశ్వర్యలక్ష్మిని బలి చక్రవర్తి నుండి విడిపించటానికి వామనావతారం, త్రివిక్రమావతారం ఎత్తాడు.

అందరికీ సమంగా చెందవలసిన లక్ష్మి అనుగ్రహాన్ని రాజులు తమవద్దనే బంధించి అహంకారులై ప్రవర్తిస్తుంటే పరశురామావతారం ఎత్తాడు. ఇక రామావతారంలో అయితే అమ్మతో కలిసే వచ్చి, ఆ అమ్మ దూరమైనందుకు ఎంత వేదన అనుభవించాడో చెప్పలేం. ఆ అమ్మను తిరిగి పొందటానికి ఎన్నో అసాధ్యమైన పనులు చేశాడు. కృష్ణావతారంలో ఎంతో మంది రాజులతో, చివరికి బావమరిదితో కూడా యుద్ధం చేసి మరీ రుక్మిణీ అమ్మను దక్కించుకున్నాడు.

మోక్షలక్ష్మి అనుగ్రహం పొందే ఆలోచన లేక ఇతర లక్ష్ముల కోసం ప్రాకులాడుతూ చివరికి కష్టాలతో మట్టిపాలైపోయే మనుష్యులకు మోక్షమార్గాన్ని అందించటానికై బుద్ధావతారం ఎత్తాడు. అధర్మం అతిగా ప్రబలిన చోట లక్ష్మి నిలువలేదని ఆ అధర్మాన్ని సమూలంగా రూపు మాపటానికి కల్కి అవతారం ఎత్తాడు. అమ్మకు దూరమై క్షణమైనా నిలువలేనని వైకుంఠాన్ని కూడా విడిచిపెట్టి వేంకటపతి అయ్యాడు. స్వామికి అమ్మ అంటే ఎంత ప్రేమో, అమ్మకు స్వామి మీద అంతకంటే ఎక్కువ ప్రేమ.

**తద్వక్షస్థల నిత్యవాస రసికాం** - ఎప్పుడూ ఆ స్వామి వక్షస్థలంలోనే నివసించడమే అమ్మకు అత్యంత ప్రీతికరం. తనను అడవులపాలు చేసినా, పదహారు వేలమంది సవతులను తెచ్చినా ఏనాడూ కోపించని అమ్మ తన స్వామికి అవమానం జరిగితే మాత్రం తట్టుకోలేకపోయింది. అది కూడా తన శాశ్వత నివాస స్థానమైన వక్షస్థలం మీద ఒక ఋషి తంతే భరించలేకపోయింది. అలిగి కొల్హాపురానికి వెళ్లిపోతే అంతటి స్వామి కూడా భూమిపైకి దిగివచ్చి ఎంతో తపస్సు చేసి మళ్ళీ ఆవిడను దక్కించుకోవలసి వచ్చింది.

- సశేషం

# ఇసుక రాతలు

సముద్ర తీరాన ఒక కుర్రాడు ఆడుకుంటూ ఉండగా ఓ చెప్పు కనిపించకుండా పోయింది. అతను వెంటనే, "ఈ సముద్రం మహా దొంగ" అని రాశాడు. కాస్తంత దూరంలో ఒక వ్యక్తి అదే సముద్రంలో వల వేసి చేపలు పట్టాడు.

ఆ రోజు తాననుకున్న దానికన్నా ఎక్కువ చేపలు దొరకడంతో, "ఈ సముద్రం గొప్ప దాత" అని రాశాడు. ఇంకొక వ్యక్తి ఈదుకుంటూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. అతని తల్లి, "ఈ సముద్రం నా కొడుకులాంటి అమాయకులను పొట్టన పెట్టుకున్న మహమ్మారి" అని రాసింది. ఒక పెద్దతను సముద్రంలోకి వెళ్ళి ముత్యాలు సేకరించి విజయవంతంగా ఒడ్డుకు చేరి ఆ ఇసుకలో, ""ఈ సముద్రం ఒకటి చాలుపో! జీవితమంతా హాయిగా బ్రతికేస్తాను" అని రాశాడు. అనంతరం ఒక పెద్ద అల వచ్చింది. వీరందరూ రాసిన మాటలను తుడిచి పెట్టేసింది. రకరకాల అభిప్రాయాలను సముద్రం తన అలలతో తుడిచేసుకుంది.

అలానే మన జీవితంలో ఎవరెవరో ఏదేదో అన్నారని బాధపడరాదు. ఇంకా, ఇతరులు ఏవేవో చెప్పిన మాటలన్నింటిని విని ఎవరిపైనా చెడు అభిప్రాయానికి రాకూడదు. వారిని కూడా మంచిగా మార్చేందుకు ప్రయత్నం చేయాలి. ఈ ప్రపంచాన్ని ఒక్కొక్కరు ఒక్కో కోణంలో చూస్తారు. చేదు అనుభవం ఎదురైనప్పుడు అలా ఎందుకు జరిగిందో అని ఆలోచించండి. దాని తొలగించి ముందుకు అడుగు వేయండి. నిజాయితీగా అంతరాత్మను తోడుగా చేసుకోండి. వినయ విధేయతలతో విజయం మీ సొంతం అవుతుంది.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***డిసెంబర్ 2022 :*** AS 6617, 6639, 7062, 7632,7633, 7634, 8430, 8561 - 8564, 8567, 8921 - 8924, 8927 - 8934, 8936, 8937, 8939
LM - 4362

***జనవరి 2023 :*** AS 5423, 6624, 6900, 7217, 7420, 7639, 7647, 8497, 8512, 8517, 8600, 8601, 8617, 8940 - 8945, 8947, 8949-898955
LM - 4363, 4365

# నేను ఎవరు?

- ఎన్. ప్రసాద్

ఈ మొత్తం ప్రపంచంలో అన్నింటికన్నా వుత్తమమైన సంబంధం 'గురు-శిష్య' సంబంధం. ఎందుకంటే, ఇతర సంబంధాలన్నీ బంధించేవే. అందుకనే వారిని 'బంధువులు' అని అంటారు. కేవలం గురుశిష్య సంబంధమే నిన్ను బంధ విముక్తునిగా గావించి, మోక్షపదవిని ఇస్తుంది. ఇతరులతో సంబంధం బాగుంటే అది తెగకుండా చూసుకోవాలి. బాగా లేకపోతే, అది వేరే రకంగా బంధిస్తుంది. మొత్తానికి బాగున్నా, లేకపోయినా చివరికి సంసారదుఃఖాన్ని కలుగుజేసేవే! కాబట్టి ఓం గురుశ్శరణమ్ మమ!

మన సంఘర్షణలన్నీ రెండు రకాలు. 1. ఏదో సంపాదించాలి 2. లేకపోతే ఏదో అవ్వాలి. మొత్తం జీవితం పొందటానికి, లేక అవ్వడానికే కేటాయిస్తాం. దీనికి కారణం 'ద్వంద్వం'. ఉన్నది ఒక్కటే అయినప్పుడు అవ్వడం, పొందడం అనేవి లేవు కదా! నీ సహజ స్థితి పూర్ణత్వంతో కూడినది. అటువంటి స్థితిలో ఏ సంఘర్షణ లేదు, ఏ ప్రయత్నం లేదు. దీనినే శ్రీ రమణులవారు 'చుమ్మాయిరప్పా' అని అనేవారు.

మన యొక్క స్వప్నావస్థ, మరియు జాగ్రదావస్థ రెండూ ఒక దానిని ఇంకొకటి పోలినవే. ఒకటేమో 'నిద్రా' జనితం, మరొకటేమో 'మాయా' జనితం. రెండూను హుళక్కే, లేనివే. వీటికి సత్యత్వాన్ని ప్రసాదించేది 'నేనే'. రెండూ నా కల్పనే. రెంటికీ ద్రష్ట అయిన నేను మాత్రమే 'సత్య' పదార్థం.

నాకు సత్యాన్ని తెలుసుకోవలసిన పని లేదు. ఎందుకంటే 'నేనే' సత్యాన్ని. నేను సత్యాన్ని అనుభవించాలని కూడా అనుకోను. ఎందుకంటే అనుభవించాలని ఇచ్చే వస్తువులన్నీ నాకు భిన్నమే కదా. 'నేను' యొక్క అనుభవం, నా స్ఫురణ రూపంలో ఎప్పుడూ వుంటూనే వుంది.

'గమ్యస్థానం' అని మనం దేనిని పిలుస్తాము? అది ప్రయాణీకుడికి 'భిన్నం'గా వుండాలి, మరియు 'దూరం'గా కూడా వుండాలి. కానీ, 'బ్రహ్మ వస్తువు' నాకు భిన్నంగా లేదు. పొందేవాడు, పొందవలసిన వస్తువు రెండూ ఒక్కటే. నేను చేరవలసిన గమ్యం 'నేనే'. కాబట్టి ఎటువంటి ప్రయాణం లేదు. నేను నేనుగా వుంటే చాలు!


శాంతం
ముకుంద
ఈరోజు రాజుగారు యుద్ధం నుండి అర్ధరాత్రి వస్తారు. నేను ఆయన మంచాన్ని సరిచేయాలి.
1
ఈ మంచం చాలా మెత్తగా ఉందే! ఒక్కసారి దీని మీద తలపెడతా. ఆ....!!!
2


రాజుగారు అప్పుడే వచ్చేశారా ?
నిద్రాభంగం ఎందుకులే చేయడం ?
ఆయిన పక్కన పడుకుంటాను.
3


4


ఈలోపు, రాజుగారు యుద్ధం తొందరగా గెలవటం
వలన అర్థరాత్రి కాకుండా సాయంత్రమే వచ్చేశారు.
5


ఆ రాజు వారిని చూసి కోపంతో
చంపబోతున్నప్పుడు అతడికి అతని
చనిపోయిన తల్లి రాసిన కాగితం
కిందపడింది .
మిమ్మల్ని ఇప్పుడే
చంపేస్తా,
ద్రోహుల్లారా !!!
అమ్మా !!!!!!
అమ్మ
6


ఆ కాగితంలో ...
సుపుత్రా,
శాంతం సముద్రం కన్నా గొప్పది.
ప్రేమతో - నీ తల్లి.
7


కాగితం చదివాక...
మీరు ఏ పాపం చేయలేదు కాబట్టి నేను మిమ్మల్ని వదిలేస్తున్నాను.
అమ్మ
8

## కొండాయార్యస్వామి

సేకరణ - మురళీ

మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లా ధాభా గ్రామంలో 1834వ సం. ఫిబ్రవరి 10 (మాఘ శుద్ధ తదియ సోమవారం) రోజున జన్మించారు కొండయ్య. తండ్రి అంబేద మల్లయ్య, తల్లి సుగంధమ్మ. శిశువు జాతకం చూసిన దైవజ్ఞులు అతడు భగవదంశ సంభూతుడని, వేదాంతి, రాజయోగి, సిద్ధ పురుషుడని, అపార మహిమలతో ఆశ్రితులను, ఆర్తులను రక్షిస్తాడని చెప్పారు. అన్నట్లుగానే పుట్టిన 12వ రోజు నుంచే మహిమలు చూపించటం మొదలుపెట్టాడు.

బాలుని మూడవ నెలలోనే తల్లి మరణించటంతో తండ్రి సంరక్షణలోనే పెరిగాడు. తండ్రి ఇతనికి ఒక గురువు వద్ద అక్షరాభ్యాసం చేయించాడు. కొద్ది కాలంలోనే చదువులలో సారమంతా గ్రహించాడు. కొండయ్యకు ఐదేండ్ల వయస్సులోనే ఈశ్వర ధ్యానం, భజనలు నిత్య కృత్యములయ్యాయి. తండ్రి ఇతనికి 12సం. వయస్సులోనే సుమతి అనే బాలికతో వివాహం జరిపించాడు. కాని సుమతి కాపురానికి రాక ముందే మరణించింది.

కొండయ్య 16వ ఏట రూపవతి అయిన అంబాబాయితో వివాహం జరిగింది. కొన్నాళ్ళ తరువాత ఆమెను పుట్టింటికి పంపించి, తాను శ్రీశైలం చేరుకుని భ్రమరాంబ మల్లేశ్వర స్వాముల దర్శనం కోరి ధ్యానంలో నిమగ్నుడైనాడు. ఒక రోజు సర్వేశ్వరుని తేజస్సు దర్శనం అయ్యింది. అశరీరవాణి సద్గురు కృపతోనే అతని సాధన ఫలిస్తుందని చెప్పింది.

కొండయ్య తన గురువులు బ్రహ్మశ్రీ పరమారాధ్యుల రాజయ్య గారిని దర్శించి ప్రణామాలాచరించి వారి ఆశీస్సులు పొందాడు. గురుశిష్యులిద్దరూ శ్రీశైలం చేరుకుని శ్రీ భ్రమరాంబా మల్లేశ్వర స్వామివార్ల దర్శనం చేసుకుని సమీపంలోని బిల్వవనంలో ప్రవేశించారు. అచ్చటి పవిత్ర ప్రదేశాలను దర్శించి సమీపంలోని గుహలో ప్రవేశించారు. కొంతసేపు ఇరువురూ ధ్యానం చేసుకున్న తరువాత గురువుగారు శిష్యునికి మంత్రోపదేశం చేశారు. శిష్యునికి తమ సర్వ శక్తులూ అనుగ్రహించామని చెప్పి, "పరమహంస" అనే నామం యిచ్చి

లోకకళ్యాణార్థం దేశసంచారం చెయ్యవలసినదిగా ఆదేశించి తమ స్వగ్రామం చేరుకున్నారు.

గురువుగారి ఆదేశానుసారం 12 సం.లు కఠిన తపస్సు చేసి ఈశ్వరకృపకు పాత్రులయ్యారు. కొండయార్యునిగా ప్రసిద్ధి చెంది ఆంధ్రదేశంలో అనేక ప్రదేశాలు పర్యటించసాగారు. తేజోమూర్తిగా వెలుగొందుచున్న కొండయార్యుని చూచి తాను వెళ్లిన ప్రదేశాలలోని ప్రజలు మహానుభావుడని గ్రహించి స్వామి బోధలు వింటూ, వారి సందేహాలను తీర్చుకునేవారు. తనను ఆశ్రయించిన భక్తుల కష్టాలను ఈడేరుస్తూ వారిలో భక్తి భావాలను నాటి ప్రచారం చేస్తూ సంచారం చేసేవారు.

స్వామి తమ స్వగ్రామం ధాభాలో ఏర్పాటుచేసిన మఠంలో నెల రోజులపాటు లక్షబిల్వార్చన, హోమం నిర్వహించేవారు. భక్తులకు మానవజన్మ విశిష్టతను తెలియజేసి భక్తి వైరాగ్యముల గురించి, లింగార్చనా విధానం, ఆత్మజ్ఞానం, జననమరణాదుల కతీతమైన బ్రహ్మానందము గురించి బోధించేవారు. తమ ప్రసంగాలలో శ్రీ రామకృష్ణ పరమహంస, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, షిర్డీ సాయిబాబా, గజానన్ మహరాజ్ వంటి మహాత్ముల ప్రసంగాలను ఉటంకిస్తుండే వారు.

స్వామి కులమత వివక్షతలు పాటించేవారు కాదు. నిమ్న కులస్తులెవరైనా రావటానికి వెనుకాడితే, వారే స్వయముగా వారి ఇంటి లోనికి వెళ్లి వారిని అనుగ్రహించేవారు. సద్గురువు, శిష్యవత్సలుడు, సన్మార్గ దర్శియైన కొండయార్యులు దీర్ఘకాలము జీవించి భక్తులకు జ్ఞాన వైరాగ్యముల గురించి బోధించేవారు. మంత్ర, లయ, హఠ యోగముల గురించి, భక్తి జ్ఞాన యోగముల గురించి విపులముగా వ్యాఖ్యానించేవారు. 105 సం. జీవించిన కొండయార్యులు కార్తీక శుద్ధ చవితి మంగళవారం (14-11-1939)న ఉదయం నిత్య అనుష్టానం పూర్తి చేసుకుని భజన కార్యక్రమములో పాల్గొని, ధ్యానములో నిమగ్నులై అశేష భక్తజనులు, సాధుసంతుల సమక్షములో శివైక్యం పొందారు. దు:ఖసాగరములో మునిగిన భక్తులకు తుక్డోజీ మహరాజ్ సంకీర్తన స్వాంతన కలిగించింది.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**డిసెంబర్ 2022**

3 శని - శ్రీగురుదేవులు స్వస్వరూపలయం చెందిన తేది. శ్రీసద్గురు పాదపూజ, భక్తసమరాధన.

4 ఆది - గీతాజయంతి - గీతాపారాయణ, శ్రీసద్గురుపాదపూజ.

7 బుధ - మార్గశిర పూర్ణిమ - దత్తజయంతి - శ్రీసద్గురుపాదపూజ

17 శని - ధనుర్మాసవ్రత ప్రారంభం

18 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

22 గురు - మాసశివరాత్రి

23 శుక్ర - అమావాస్య

25 ఆది - క్రిస్మస్ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

**జనవరి 2023**

1 ఆది - ఆంగ్ల సంవత్సరాది - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

2 సోమ - ముక్కోటి ఏకాదశి - ఉత్తరద్వార దర్శనం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

6 శుక్ర - పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

12 గురు - శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన

14 శని - భోగి పండుగ, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. శ్రీ గురుదేవులకు భోగిపళ్ళు పోయుట

15 ఆది - సంక్రాంతి పండుగ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

16 సోమ - కనుమ పండుగ

17 మంగళ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

20 శుక్ర - మాసశివరాత్రి

21 శని - అమావాస్య

26 గురు - వసంత పంచమి, శ్రీ సరస్వతీ పూజ, గణతంత్ర దినోత్సవం

28 శని - రథసప్తమి

# వివేక చూడామణి

(గత సంచిక తరువాయి) సేకరణ - రమణ ప్రసాద్

**బ్రహ్మ నిరూపణము**

కావున ఆ బ్రహ్మ జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము అను త్రిపుటి లేనిది. పండితులు అది అనంతము, నిర్వికల్పము, అఖండ చైతన్యముగా గుర్తింతురు. (241) ఆ బ్రహ్మము మనో వాక్కులకు అందనిది, అప్రమేయము ఆద్యంత రహితము, సంపూర్ణము.

**మహావాక్య విచారము**

**"తత్త్వమసి"** (ఛాందోగ్య) లోని **తత్- త్వం** అని శోధించిన బ్రహ్మము - ఆత్మ రెండును ఒకటియే అని వేదములచేత ప్రతిపాదింపబడినది. స్వేతకేతు సకల విద్యలను అభ్యసించి తండ్రి వరుణుని వద్దకు వస్తాడు. వరుణుడు, "ఏది తెలుసుకుంటే తెలుసుకోవలసినది ఏదీ లేదో అట్టి ఆత్మ తత్వాన్ని అధ్యయనం చేశావా?" అని వరుణుడు అడుగుతాడు. స్వేతకేతు సమాధానం చెప్పలేకపోతాడు. అప్పుడు తానే బ్రహ్మ తత్వాన్ని బోధిస్తాడు.

సూర్యుడు మిణుగురు పురుగు వాచ్యార్థములో వేరైనా వాటి ఏకత్వము అవి ఇచ్చు కాంతి; అట్లే సముద్రము, నూయి (జలము); రాజు, సేవకుడు ( మానవుడు). అటులే పరమాత్మ, జీవాత్మ ఉపాధులు వాస్తవముగా వేరుకాదు. కావున బ్రహ్మముయందు కల్పితమైన ద్వైతమును శ్రుతి ప్రమాణములైన యుక్తులచేత త్రోసిపుచ్చవలెను. (247)

**తత్, త్వం** పదములకు జీవేశ్వరులు వాచ్యార్థములు విరుద్ధ ధర్మములు కలవారగుటచే జీవాత్మ పరమాత్మల అఖండైక రసత్వము సిద్ధింపవలెనన్న మహావాక్యమునందు లక్షణావృత్తిని అనుసరింపవలెను. అప్పుడే వాని పరిజ్ఞానము కలుగును. అనగా భాగ త్యాగ లక్షణముచే ఐక్యము సంభవించును.

భాగ త్యాగ **లక్షణము** : అనగా కల్పితాంశము విడిచి ముఖ్యాంశమును గ్రహించుట. 1.జహల్లక్షణ, 2.అజహల్లక్షణ, 3.జహదహల్లక్షణ అని లక్షణావృత్తి త్రివిధము.

**1.జహల్లక్షణ :** విరుద్ధాంశమును విడిచి ముఖ్యాంశమును

గ్రహించుట. ఉదాహరణము : **గంగాయాం ఘోషః** - గంగయందు గొల్లపల్లె వుండదు కనుక గంగను విడిచి గంగ ఒడ్డున ఉన్న గొల్లపల్లె ఉండునని గ్రహించుట.

**2. అజహల్లక్షణ** : విరుద్ధాంశమును విడువకుండ ముఖ్యాంశమును గ్రహించుట. ఉదాహరణము - **మంచాః క్రోశయంతి** (మంచము లరచుచున్నవి) మంచములరవవు కనుక మంచము మీద పురుషులు అరచుచున్నారు అని గ్రహించవలెను.

**3. జహదహల్లక్షణ** : విడిచి విడువక - అనగా కొంత భాగమును విడిచి కొంత భాగమును గ్రహించుట. ఉదాహరణము - **సోయం దేవదత్తః** (ఆ దేవదత్తుడే ఇతడు). దేవదత్తుడు రాజు. కొన్ని సంవత్సరముల తరువాత కాశీ నగరంలో సామాన్యునిగా కనపడ్డాడు. ఆ దేశ కాలములను విడిచి లక్షార్థ భూతమగు దేవదత్తుడే ఇతడు అని గ్రహించుట.

అటులనే తత్ - తత్త్వమస్యాది వాక్యములయొక్క లక్ష్యార్థమును లక్షణావత్తిచే గ్రహింపవలెను. అట్లు గ్రహించుట వలన జీవేశ్వరైక భావము స్థిరపడి ఎరుక మరపులు లేని సచ్చిదానంద స్వస్వరూప స్థితి అలవడును. అట్టిస్వస్వరూపమును బోధించుటకై **"ప్రజ్ఞానం బ్రహ్మ"** (ఋగ్వేదము), **''అహం బ్రహ్మాస్మి''** (యజుర్వేదము), **''తత్త్వమసి''** (సామవేదము), **"అయమాత్మా బ్రహ్మ"** (అధర్వణ వేదము) అని నాలుగు మహావాక్యములు చెప్పబడినవి. అందు **''తత్త్వమసి''** అను మహావాక్యమునకు అర్థము ఆచార్యులవారు బోధించుచున్నారు :

**తత్** - అనగా సజాతీయ విజాతీయ, స్వగత భేదము లేనిది, నామ రూప రహితమై సృష్టి పూర్వమునందు, సృష్టి అనంతరమునందు ఏకరూపమగు సద్వస్తువు. వాచ్యార్థము ఈశ్వర స్వరూపము, లక్ష్యార్థము పరబ్రహ్మ స్వరూపము.

**త్వమ్** - శిష్యునియొక్క దేహేంద్రియాదులకు అతీతమై సాక్షిభూతమగు చైతన్యము. వాచ్యార్థము జీవ స్వరూపము, లక్ష్యార్థము ప్రత్యగాత్మ స్వరూపము.

**అసి - జీవేశ్వరైక్యము** - అనగా పరమాత్మ ప్రత్యగాత్మల ఐక్యము.

ఈ విధముగా లక్షణ వృత్తి సాయమున జీవాత్మ పరమాత్మ రెండు ఒక్కటియే అను భావమునందు స్థిరపడును.(251)- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

పొద్దుపొడిచిన వేళ, రాముడు తన సహోదరుడైన లక్ష్మణుడు, మునివర్యులైన విశ్వామిత్రునితో కలసి జనక మహారాజుయొక్క యాగశాలకు బయలుదేరాడు. జనకుడు, యవ్వన పరాక్రమములతో ప్రకాశించుచున్న రామలక్ష్మణులను గాంచి మిక్కిలి పారవశ్యమునకు లోనయ్యాడు. విశ్వామిత్రుల ముంగిట నిలిచి, "ఈ యువరాజులు ఎవరు?" అని ప్రశ్నించారు. "మహారాజా! ఈ యువరాజులు అయోధ్యరాజు దశరథుని యొక్క కుమారులు" అని బదులిచ్చి, రామలక్ష్మణులను ఆతనికి పరిచయము గావించి, దశరథ మహారాజు యొక్క కీర్తి ప్రతిష్టలను ఇక్ష్వాకువంశ ఘనతను వివరించిన పిదప రాముని విలువిద్యా ప్రావీణ్యతను గూర్చి పొగడి, ఆతడు తన యాగమును కాపాడుటకై అసుర కులమునకు చెందిన రాక్షసులను, ముఖ్యంగా తాటకి మరియు సుబాహులను సంహరించిన విధమును, వేల యోజనముల దూరం పోవువరకు మారీచుని తన్నిన రీతిని తెలియపరచి రాముని వీర పరాక్రమములను వివరించారు. "విదేహ మహారాజా! వీరు మీయొక్క యాగమును వీక్షింపగోరి ఇచ్చటకు అరుదెంచారు. మొదటివాడు రాముడు శివధనస్సును విరచివేయగల సమర్థుడు" అని విశ్వామిత్రుడు రాముడ్ని జనకునికి పరిచయం గావించారు.

జనక మహారాజుల కులగురువు, అహల్యపుత్రుడైన సదానంద మహర్షి, మిథిలానగర రాజుయొక్క కులప్రతిష్టను విశ్వామిత్రులకు వివరించాడు. పిదప ఆతడు శివధనుస్సు యొక్క మహిమను గూర్చియూ తెలియజేసాడు. "పదకొండు రోజులు దక్షుడు ఒక గొప్ప యాగమును చేసాడు. దానికి దేవతలందరినీ ఆహ్వానించాడు. కానీ తన పుత్రికైన కాత్యాయిని భర్తయైన పరమేశ్వరుని అవమానించదలచి ఆతనిని మాత్రం ఆహ్వానించలేదు. ఆ అవమానమును తట్టుకోలేని

కాత్యాయిని తన తండ్రి చేస్తున్న యజ్ఞగుండమున దుమికి ఆత్మత్యాగ మొనరించుకుంది. ఈ సమాచారమును తెలుసుకొనిన శివుడు, తాను సృష్టించిన వీరబాహువుతో కలసి దక్షుని యాగశాలకు వెడలి, తన వింటిచే దక్షుని యజ్ఞమంతటినీ ఛిన్నాభిన్నము గావించి, ఆతడి శిరస్సును నరికివేసెను. చుట్టూరా ఉన్న దేవతలంతా శివుని పలువిధములుగ కొనియాడి, శాంతపరచిరి. ఆతని ధనస్సు యొక్క బలమును పరోక్షంగా తెలియజేసి, దాని మూలంగా పెద్ద అపాయం కలుగబోవునని తెలిపి, దానిని వదలి వేయమని వేడుకొనగ, దానిని ఆ పరమేశ్వరుడు ఈ జనకుని ముందు తరములలో నొకడు, పరాక్రమవంతుడు అయిన దేవరాథననబడు ఒక మహారాజు వద్ద వదలివేసాడు. అదే శివధనుస్సుగా పేర్కొనబడు ఈ విల్లు.

యుక్తవయస్సులో, సీత ఒక దినమున ఆడుకొనుచూ ఈ వింటిని భద్రపరచిన పెట్టెను ఎత్తింది. ఆ దృశ్యమును గాంచిన రాజు “ఇంత బరువైనది, ఎవరి చేతనూ కదప వీలుగానిదైన ఈ పెట్టెను నా కుమార్తె బహు సునాయాసముగ ఎత్తివేసిందే! కావున ఎవరైతే ఈ శివధనుస్సుకు వింటినారి సంధించగలరో ఆతడే ఈమె కరమందగల యోగ్యత గలవాడు” అని ధృడ నిశ్చయం చేసాడు. సీతయొక్క శీల, సౌందర్యములను వినిన ఆమెను వివాహమాడదలచి ఎందరో యువరాజులు ఈ వింటిని ఎత్త యత్నించి, ఘోర విఫలులైనారు. అంతటి పరాక్రమముతో కూడినది ఈ విల్లు” అని ఆ శివధనస్సు యొక్క ఘనతను వివరించాడు సదానందుడు.

ఆ తరువాత జనకుడు, “ఓ బ్రహ్మర్షీ! మీ శిష్యుడైన రాముడు ఈ ధనుస్సుకు వింటినారిని సంధించినచో నాకంటే మిక్కిలి సంతషించువారెవరూ ఉండరు. దైవానుగ్రహము ఉంటే గనుక ఇది తప్పక జరిగి తీరుతుంది. యువరాజా! నీవు ఈ వింటికి నారిని సఫలీకృతముగ సంధించెదవుగాక!” అన్నారు.

- సశేషం

# ఆశ్రిత పారిజాతం

- పెనుమాక నాగేశ్వర రావు

గుంటూరులోని శ్రీ పాండుగారి ఇల్లు మా కుటుంబానికి మొదటి ఆశ్రమం. సద్గురుమూర్తిని మొట్టమొదటిసారి దర్శనం చేసుకున్నది ఆ ఇంటిలోనే. చాలాసార్లు ఆ ఇంటిలోనే బాబూజీ తీర్థ ప్రసాదాలు, బోధ అందుకోవటం జరిగినై. అప్పటికి నా వయసు సుమారు పది, పన్నెండు ఏళ్ళు వుంటాయి. తదుపరి దసరా పండుగకు గుండుగొలను గ్రామమునకు రెండు పర్యాయములు వెళ్లటం జరిగినది. అక్కడ ఓ క్లీనిక్‌లో మా బస. ఆ తర్వాత తెలిసింది ఆ క్లీనిక్ డాక్టర్ శ్రీ లంకా సూర్యనారాయణ గారిదని.

ఆశ్రమ స్థాపన జరిగిన పిమ్మట బాబూజీ దర్శనం ఆశ్రమంలోనే. ఈ యాభై సంవత్సరాలుగా ఆశ్రమానికి రావడం, ఆశీస్సులు అందుకోవడం ఇంటికి వెళ్లటం జరుగుతూనే వున్నది.

నవరాత్రులలో సద్గురు పాదపూజా మహోత్సవం రోజున శ్రీ శ్రీ శ్రీ బాబూజీ మహరాజ్ బాబూ విజ్ఞాన మందిరం నుండి రామాలయానికి వేంచేసే అద్భుత ఘట్టం ఓ సారి స్ఫురణకు తెచ్చుకునే ప్రయత్నం చేద్దాం. నూతన వస్త్రాలంకృతలైన శ్రీబాబు మెడలో ఒకేఒక్క పూలదండ వేలాడుతుండగా, మందస్మిత వదనంతో, చిరు గంభీరంగా, ఎడమచేతిని వక్షస్థలం మీద వుంచుకుని, కుడిచేతిని అలా కదిలిస్తూ, ఎంత అడుగు వేస్తే నయన మనోహరంగా వుంటుందో అంతే అడుగు వేస్తూ వచ్చే బాబూజీ మహరాజ్ వారికి చిన్నారులు హారతులతో ఆహ్వానం పలుకుతుండగా వారిని ఓరకంట గమనిస్తూ, వాళ్ల నిష్కల్మష హృదయాల అమాయకత్వానికి మురిసిపోతూ ముందుకు నడిచి వచ్చే శ్రీ బాబు వెనుక పెద్దలు శ్రీయుతులు తారకంగారు, వెంకటరత్నంగారు, విశ్వనాథం మామయ్యగారు, సూర్యనారాయణరాజుగారు, ఛత్రం పట్టుకుని మరో భక్తులు, వేద పారాయణ జరుగుతుండగా, రాజసం, తేజసం కలబోసిన రాజర్షి బాబూజీ రామాలయం లోనికి ప్రవేశించే సమయానికి స్వాగతం సుస్వాగతం అనే మధురమైన పాట శ్రావ్యంగా పాడుతుండగా, రామాలయంలో అన్ని దీపాలు వెలిగేవి. బయట దీపావళి టపాకాయలు నిర్విరామంగా మ్రోగుతుండేవి. భక్తులంతా లేచి నిలుచుండేవారు. వేదిక మీద శ్రీ లలితానంద సరస్వతీ స్వాముల వారు, పూజ్యశ్రీ మాతాజీ వారు, మరికొందరు కలసి మంత్రోచ్ఛారణ

చేస్తుండేవారు. బాబూజీ రాములవారి ఆలయం లోనికి, రాధాకృష్ణుల మందిరంలోనికి వెళ్ళి నమస్కరించుకుని సింహాసనం వద్దకు చేరుకునేవారు. అప్పట్లో సింహాసనం ముందర పెద్ద పీట వేసి దానిపైన ఓంకారం, మరికొన్ని బీజాక్షరాలు వ్రాసి వుంచేవాళ్ళు. బాబూజీ మహరాజ్ అక్కడ కూర్చుని తమ అంగుష్టాన్ని ఆ పీటమీద వుంచి కొద్దిసేపు పూజ చేసేవారు. ఆ తదుపరి పూజ చేసుకునే భక్తులు సమర్పించుకున్న నూతన వస్త్రాలు శ్రీ బాబు వేదిక పైననే కట్టుకునేవారు. ధోవతి కట్టుకునేటప్పుడు వారు కుచ్చెళ్ళు పెట్టుకునే విధానం ఎంతో బాగుండేది. ఆనక మాతాజీ వారో, లలితానంద సరస్వతీ వారో పట్టుకున్న పూల పళ్ళెంలో నుంచి పూలు అందుకుని సింహాసనం మీద ఆ పూలను విరజిమ్మే దృశ్యం వర్ణనాతీతం. ఆ మనోహర దృశ్యం చూసి తీరాల్సిందే!

పాదపూజ మొదలయ్యేది. పాదప్రక్షాళన చేసేటప్పుడు కొంచెంగా పాదాలను పైకి ఎత్తేవారు బాబు. పాదాలను వస్త్రంతో తుడిచి పూజా కార్యక్రమం కొనసాగేది. నివేదన జరిగిన తరువాత చిన్న వెండిపళ్ళెంలో ద్రాక్ష, కిస్మిస్, పటికబెల్లం తదితరాలు వుండేవి. వాటిల్లోనుంచి శ్రీ బాబు ఒకదానిని స్వీకరించేవారు. ఎంత సున్నితంగా, సుతారంగా స్వీకరించేవారో తలుచుకుంటే మనసు పరవశించిపోతుంటుంది. ఇప్పటికీ శ్రీ బాబూజీ మహరాజ్‌కి నైవేద్యం పెట్టేటప్పుడు అదే దృశ్యం కళ్ళముందు కదలాడుతుంటుంది.

ఆ తరువాత మొదలయ్యే నమస్కారాల ఘట్టం ఒక్కటీ ఒక ఎత్తు. శ్రీ బాబుకు ఇరువైపుల ఇద్దరు విభూతి చేత ధరించి నిలుచుండేవాళ్ళు. దంపతులు నమస్కరించుకుని శ్రీ బాబును చూస్తుంటే, ఇద్దరికీ చెరొక చేతితో రక్ష పెట్టేవారు శ్రీ బాబు. అలా మొదలయ్యే నమస్కారాలు పూర్తయ్యేసరికి కొన్నిసార్లు తెల్లవారుఝాము వరకు కొనసాగి “అదిగో అల్లదిగో” పాటతో పూర్తయ్యేది.

బాబూజీ సింహాసనం నిండా పూలదండలే. వారి మెడనిండా పూలదండలే. మధ్యమధ్యలో దంపతుల మెడలో శ్రీబాబే దండవేసి ఆశీర్వదించేవారు. మెడనిండా పూలదండలతో కొంచెంగా చెదరిన ముంగురలతో చిరునవ్వు చిందిస్తూ భక్తులను ఆశీర్వదిస్తూ అభయం ఇచ్చే శ్రీ బాబు రూపం అపురూపం. అలాంటి సద్గురుదేవులు భక్తుల కోరిక మేరకు ఏర్పాటుచేసిన మన కాళీవనాశ్రమం నిజమైన ఆశ్రిత పారిజాతం !!

శ్రీ సద్గురు స్వామి స్థాపిత ఆశ్రమ స్వర్ణోత్సవము మరియు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాదబాబూజీ మహరాజ్ వారి పుణ్యారాధన దృశ్యములు



నగర దర్శనము

శ్రీ మతాజీవారిచే పాదుకా ప్రదక్షిణము





దీక్షా స్వీకరణ

యాగశాల ప్రవేశము





కర్తలచే శ్రీ సద్గురు
పాద పూజ



కర్తలచే శ్రీ సద్గురు
పాద పూజ



ఊంజల సేవ



సాధు ధర్మ సమ్మేళన
ప్రారంభ దృశ్యం

# అన్నదాన వైశిష్ట్యం

- ప్రసాద వర్మ కామఋషి

అన్నదానాన్ని మించి జీవుని సంతృప్తి పరచే దానం మరొకటి లేదు. ఇటీవల అనేక ఆలయాలు, ఆశ్రమాలు, దేవస్థానాలలో అన్నదాన కార్యక్రమం విరివిగా జరుగుతున్నది. ఇది అక్కడ వెలసిన ఆయా దేవతల ప్రసాదం అన్న భావనతో స్వీకరిస్తున్నాం. వితరణ చేసేవారూ ప్రసాదం తీసుకు వెళ్ళండి అనే అంటారు. ప్రసాదం అనగానే పుచ్చుకునే వారు కూడా నేను పుచ్చుకునే వాడిని అన్న న్యూనతాభావం లేకుండా తృప్తిగా స్వీకరిస్తారు. ప్రసాదం అంటే ఏదో పప్పన్నం, పాయసం మాత్రమే కాదు. ప్రసాద గుణం - ప్రేమ, వాత్సల్యం, క్షుధార్తి తీర్చవలెనన్న ఆశయం. దేవాలయంలోకి వెళ్ళటానికి అందరికి అర్హత ఉన్నట్లు అన్న దానం పొందటానికి అందరూ అర్హులే! డ్రస్సు, ఆడ్రసు చూడం, కులమత ధనిక బీద అధికార అనధికార భేదం లేక అందరూ కలిసే కూర్చుంటారు.

త్రిమూర్తులకు అన్నదానం చేసిన పతివ్రత కథ మనకు తెలుసు. **శ్రీవిశాలాక్షి బంగారు తెడ్డు నందు అమృత పాయస మొసగు అభ్యాగతులకు కాశికాపురి మధ్యాహ్న కాలమందు** అన్న సంగతి తెలుసు. **వలయు భోజ్యంబు లింట నవ్వారు కాగ, ఆతిథు లేతర నడికి రేయైన బెట్టు అన్నపూర్ణకు ఉద్దియగు ప్రవరుని గృహిణి** గురించి విన్నాం. రంతి దేవాదులు ఉత్తమగతులు పొందినట్లు భాగవతం చెపుతున్నది.

కర్ణుని వృత్తాంతమొకటి ప్రచారంలో ఉంది. ఊర్ధ్వలోకాలకు పయనమై వెళుతున్న కర్ణునికి దారిలో ఆకలై ఒక చెట్టుకాయ కోసి తినబోతే అది బంగారుకాయగా మారిపోయింది. ఆ పక్కనే ఉన్న నదిలో నీరు త్రాగబోతే దోసిట్లో నీరూ బంగారమైపోయాయి. క్షుద్బాధ తట్టుకోలేక తండ్రి అయిన సూర్యభగవానుని ప్రార్థించాడు. నాయనా నీవెన్నో దానాలు చేసిన మహాదాతమే. కాని ఎన్నడూ ఎవరికీ అన్నదానం చెయ్యలేదు. అందుకే నీకీ బాధ కలిగింది. తిరిగి భూలోకానికి వెళ్ళి కొంతకాలం అన్నదానం చెయ్యి అని చెప్పాడు. కర్ణుడు భూలోకానికి వచ్చి పక్షం రోజులపాటు ఆర్తులకు అన్నదానం చేసి తరించాడు. కర్ణుడు అన్నదానం చేసిన ఈ పక్షమే మహాలయపక్షంగా పిలవబడుతోంది.

**తన్ను చంప వచ్చిన శత్రునకునైన** అన్నం పెడితే బంధుత్వం కలుస్తుందని, **అన్నదానము బలవన్య దానంబులు ధరణి** అని భోజరాజీయం

వివరిస్తుంది. అన్నదానం చేసే పుణ్యాత్ముని తలచుకున్నా, చూసినా, సంభాషించినా, పాదధూళి సోకినా పాపాలన్నీ నశిస్తాయని, భూప్రదక్షిణం చేసిన పుణ్యం కలుగుతుందని - రుక్మాంగద చరిత్రలో ప్రౌఢకవి మల్లనగారు చెబుతారు.

డొక్కా సీతమ్మగారు అన్నదానం చేసింది అలుపు లేకుండా. ఈ వార్త లండన్ లోని ఆంగ్ల ప్రభువులదాకా వెళ్ళింది. తన పట్టాభిషేక సమయాన ఈ తల్లి ఆశీస్సులు కోరుకున్నాడా ప్రభువు.

గృహస్థుడు నిరతాన్నదానపరుడుగా ఉండేవాడు. బ్రహ్మచర్య. వానప్రస్థాది ఇతర ఆశ్రమాలవారి ఆకలిదప్పులు తీర్చేది గృహస్థే. మన ప్రాచీన భారతీయ సాంప్రదాయం నేర్పిన సామ్యవాదం ముందు, మానవతావాదం ముందు మార్క్స్, ఎంగెల్స్‌లు ఎక్కడయ్యా మీరు? దేహమే దేవాలయం అన్న విశ్వాసం ఆర్ష సంప్రదాయంలో కనిపిస్తుంది. ఈ దేహం దేవుణ్ణి చేరటానికి ఓ గొప్ప సాధనం. ఈ సాధనం సవ్యంగా పని చెయ్యాలంటే అన్నమే ఆధారం. **అన్నాద్భవంతి భూతాని** అన్నము నుండియే జీవ దేహములు పుట్టుచున్నవి. అన్నముచేతనే జీవించుచున్నవి అని ఉపనిషద్వాక్యం. **అన్నేత్రి అని భూతాని అన్నంహి ప్రాణమితి శ్రుతి: తస్మాదన్నం ప్రదాతవ్యం అన్నంపా పరమం హవి** ఆహారం జీవశక్తి అని, అంతర్గత శక్తి అని వేదవచనం. భౌతిక గుణాతీతమైనది అమూల్యమైనది, అన్నదానం. ఇదీ పరమాత్మోపాననయే. మన ఆర్ష సంప్రదాయంలో ఆకలిగొన్న వారికి అన్నం పెట్టటమన్నది ఒక పవిత్ర సంప్రదాయం. సమాజ ఆరాధన. పరమాత్మ వలన సృష్టి అయిన వస్తువులు ఆయనకే సమర్పించి దానిని ప్రసాదముగా స్వీకరించుట (షోడశ) ఉపచార మంత్రములలో ఇమిడి ఉండుట గమనార్హము.

భారతీయ ధార్మిక జీవనంలో దానానికి అత్యంత ప్రాధాన్యత వున్నది. దానాలలో అన్న దానానికున్న ప్రాముఖ్యత గురించి ప్రత్యేకంగా చెప్ప పనిలేదు. **దానం ప్రియవాక్సహితం** అని పెద్దల మాట. రామాయణం దాని ప్రశస్తిని గురించి విస్తారంగానే ప్రస్తావించింది. పేరుప్రఖ్యాతులు ఆశించి అహంకార ధిక్కారములతో దానం చెయ్యరాదంటుంది. దాన స్వీకర్తవలన, లేక భోక్తవలన తాను ధన్యుడనగుటకు అవకాశం కలిగినదని నిరాడంబర భావన కలిగి ఉండాలి. **దాతవ్యమన్నం విధివత్ సత్కృత్య నతు లీలయా.** విధి పూర్వకముగా అవమానించకుండా భోజనం

పెట్టాలి అని బాలకాండలో దశరథుని ఆజ్ఞ. గౌరవం చూపకుండా తోచిన రీతిలో అలవోకగా దానమీయరాదు. అన్నవస్త్రాలు సమర్పించండి అని దశరథుని మాట. సమర్పించండి అన్నాడుగాని దానం చెయ్యండి అనలేదు. అన్నం వితరణ చెయ్యవలసిన వస్తువేగాని అమ్ముకొనేది కాదు. అసలు అమ్మబడిన అన్నం తినరాదని శాస్త్రవచనం. పంచయజ్ఞాలలో అన్నదానం కూడా ఉన్నది. కేవలం కర్తవ్యబుద్ధితోనే, ప్రతిఫలాపేక్ష రహితంగా చెయ్యాలి.

భగవన్నివేదితమైన పదార్థం దివ్య ప్రసాదం అవుతుంది. నిజానికి ఆ పరమాత్ముడే అన్నము, అన్నదాత, అన్నభోక్త అవుతున్నాడు. ఆ భగవత్ శక్తియే జఠరాగ్ని రూపంలో మనం భుజించిన ఆహారాన్ని జీర్ణంచేసి శరీరాన్ని నిలుపుతున్నాడని ఋషివాక్కు. వంటచేసేవారి మనస్సులో గల ఆత్మీయత, ప్రేమ, సేవాభావం వంటి గుణాలు ఆ ఆహారంపై ప్రభావం చూపుతాయి. రుచిలో గుణంలో మార్పు తెస్తుంది. ఇంకా ముందుకెళితే ఆహారం ఎక్కడ పండుతుందో, ఎక్కడ వండబడుతుందో ఎక్కడ భుజింపబడుతుందో - ఆయా ప్రదేశాల గుణదోషాల ప్రభావం దానిపై పడుతుంది. ఆ ఆహార వినియోగానికి సహకరించిన దాత **అర్థశౌచం** పాటించేవాడయి ఉండాలి. ధర్మమార్గంలో సంపాదింపబడిన న్యాయార్జిత విత్తమునే దానము చేయవలెను. ధర్మార్జనతోనే దైవ కైంకర్యం దైవారాధన దానధర్మాలు చెయ్యాలంటుంది ధర్మశాస్త్రం. (దోష సంక్రాంతమైన ఆహారాన్ని స్వీకరించిన వాని మనఃప్రవృత్తులు వేరుగా ఉంటాయి.)

అన్నం కేవలం ఆకలితీర్చే సాధనం మాత్రమే అనుకోరాదు. అన్నాన్ని సాక్షాత్పరబ్రహ్మ స్వరూపంగా భావించి భుజించటం ఒక ఉపాసన. అన్నమనే హవిస్సు జిహ్వ, కంఠాది ఇంద్రియముల ద్వారా లోపల ఉన్న వైశ్వానరాగ్నిలో హోమం చేయటమే ఆహారసేవనం. జఠరాగ్నిని వైశ్వానరునిగా భావన చేసి ప్రాణాహుతులను హోమం చేస్తూ **అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః** అని స్మరిస్తూ చేసిన భోజనం యజ్ఞమే అవుతుంది! ఇంతటి పవిత్ర భావనని, శాస్త్రీయ పద్ధతిని అనుసంధానించారు మన పెద్దలు. **అన్నదాతా సుఖీభవ!**

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర
## శ్రీ సుబ్బరాజుగారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీ ఉనికిలి సుబ్బరాజుగారు, వారి ధర్మపత్ని గంగమ్మగారు శ్రీ బాబు పరమ భక్తులు. సుబ్బరాజుగారు ఏలూరులోను, కొవ్వూరులోను సివిల్ ఇంజనీరుగా పనిచేసి పదవీవిరమణ అనంతరం కొవ్వూరులో ఉండేవారు. శ్రీ బాబు తరచు వారింటికి వెళ్ళి దర్శనభాగ్యం కలిగిస్తూ ఉండేవారు.



ఒక రోజున భీమవరం తాతయ్యగారితోను, మరికొందరు భక్తులతోను కలిసి శ్రీ బాబు కారులో రాజమండ్రి వెడుతున్నారు. కారు కొవ్వూరు సమీపిస్తుండగా, ఉన్నట్లుండి శ్రీ బాబు డ్రైవరును తప్పుకోమని, తామే కారు నడపటం మొదలుపెట్టారు. అంతలో బయట భయంకరమైన గాలివానతో తుఫాను మొదలైంది. శ్రీ బాబు “తాతయ్యా! ఇప్పుడు కారు బోల్తాపడితే ఏం చేస్తావు?” అని అడిగారు. తాతయ్యగారు బోసినోటితో నవ్వుతూ “మీరుండగా మాకేం భయం బాబూ!” అన్నారు. “అయితే అందరూ జగన్మాతను తలచుకొని కళ్ళు మూసుకోండి” అని శ్రీ బాబు అన్నారు.

అందరూ కళ్ళు మూసుకొని “అమ్మా! బాబూ!” అనటమూ, కారు బోల్తాపడటమూ, తన ప్రక్కన ఉన్న భక్తుడు పడిపోతుంటే తమ చెయ్యి అడ్డం పెడుతూ శ్రీ బాబు “అమ్మా! జననీ!” అని కేక పెట్టటమూ అంతా కన్నుమూసి తెరిచే లోపల జరిగిపోయింది. కారు బాగా దెబ్బతిన్నది. అందరూ కారులోనే ఉన్నారు. ఎవరికీ ఏ అపాయమూ జరుగలేదు. కాని శ్రీబాబు చేతినిండా గాజుపెంకులు గుచ్చుకుని రక్తం కారుతున్నది. ఏం జరిగిందో కూడా తెలియక అందరూ కొయ్యబారిపోయారు.

శ్రీ బాబు తామే కారు డోరు తెరచుకొని బయటకు వచ్చి, అటువైపు వస్తున్న ఎవరిదో కారును ఆపి “అయ్యా! మా కారు ప్రమాదానికి గురైంది. తమరు దయచేసి మాకు కొంచెం సహాయం చేయగలరా?” అని అడిగారు. ఆ కారులో వారు శ్రీ బాబును చూసి గుర్తించి ఎంతో బాధపడుతూ “తమరా బాబూ! రండి, అందరిని రాజమండ్రి తీసుకొని వెడదాము” అన్నారు. శ్రీ బాబు “వద్దు బాబూ! అంత శ్రమ వద్దు. ఇక్కడే కొవ్వూరులోనే మా వాళ్ళు వున్నారు. వారింటి వద్ద దింపండి” అని సుబ్బరాజుగారి ఎడ్రెస్ యిచ్చారు.

వాళ్ళు శ్రీ బాబును, భక్తులను సుబ్బరాజుగారింటి దగ్గర దింపారు. సుబ్బరాజుగారు శ్రీ బాబును, భక్తులను ఆ పరిస్థితిలో చూసి కన్నీరు పెట్టుకున్నారు. శ్రీ బాబు వారిని సముదాయిస్తూ 'బాధ పడకండి. నాకు తగిలిన దెబ్బ ప్రమాదమైనదేమీ కాదు. ఈ ప్రమాదాన్ని ఊహించే, ఎవరికీ ఎట్టి అపకారము జరుగకుండా డ్రైవింగ్ నేను తీసుకున్నాను. జగన్మాత తన బిడ్డలను యిలా రక్షించుకున్నది' అన్నారు. సుబ్బరాజుగారు తమ కారులో శ్రీ బాబును హాస్పిటల్‌కు తీసుకొని వెళ్ళారు. తుఫాను వలన ఆగిపోయిన విద్యుత్ సరఫరా సరిగా అప్పుడే మళ్ళీ వచ్చింది. డాక్టర్లు శ్రీ బాబు చేతిలో విరిగిన గాజు ముక్కలను జాగ్రత్తగా తీసి, కుట్లు వేసి, కట్టు కట్టటానికి రెండు గంటలు పట్టింది. ఆపరేషన్ సమయంలో మత్తు యివ్వటానికి శ్రీ బాబు ఒప్పుకోలేదు. "మీ పని మీరు కానివ్వండి" అని డాక్టర్లకు చెప్పి, ప్రక్కనే ఉన్న సుబ్బరాజు గారికి దివ్యమైన  బోధను అందిస్తూ "జ్ఞాని శరీరంతోనే ఉన్నా, తాను ఆ శరీరానికి  ఎప్పుడూ విలక్షణంగానే ఉండగలుగుతాడు. శరీరానికి కలిగే సుఖదు:ఖాలు, బాధలు అతనికేమీ అంటవు. దానికి కారణం, అతడు తన మనస్సను సదా తనలోని ఆత్మవస్తువునందే, అంటే బ్రహ్మమునందే నిలిపి వుంచుతాడు" అని చెప్పారు.  అదే విషయం ఆచరణలో చేసి చూపిస్తున్న శ్రీ బాబుకు శతసహస్ర వందనములు సమర్పించుకున్నారు సుబ్బరాజుగారు.

అప్పుడా దంపతులు నాకు చేసిన సేవను నేను ఎన్నటికీ మరువలేను. నన్ను గురించి డాక్టర్లతో మాట్లాడటం, మందులు అవీ నాకు టైము ప్రకారము యివ్వడం మొదలైన బాధ్యతలను సుబ్బరాజుగారు స్వయంగా చూసుకునేవారు. ఇక నా నివేదన విషయంలో గంగమ్మగారు నా పథ్యమునకు తగిన ఆహారం తయారుచేసి, నా వద్ద కూర్చొని, అన్నం కలిపి ముద్దలు చేసి, నా నోటికందించి ఏ సమయానికి ఏ ఆహారాన్ని అందివ్వాలో, స్నానాదికములైన ఉపచారాలు ఏ సమయానికి ఏవి జరగాలో జరుపుతూ, కన్నతల్లి పసిబిడ్డను కనిపెట్టి చూసుకున్నట్లే నన్ను చూసుకున్నారు" అని శ్రీ బాబు ఆ తరువాత ఎన్నో సార్లు వారి సేవను తలచుకున్నారు. సుబ్బరాజు గారింట్లోనే శ్రీ బాబు పది రోజులు విశ్రాంతి తీసుకొని గుంటూరు వెళ్ళిపోయారు.

ఆశ్రమ నిర్మాణం జరిగే సమయంలో సుబ్బరాజుగారు గుంటూరులోనే ఉంటూ, ప్రతిరోజూ నిర్మాణ కార్యక్రమమును పర్యవేక్షించే వారు. ఆ తరువాత ఆ దంపతులు ఆశ్రమంలోనే ఒక కుటీరాన్ని నిర్మించుకొని తమ శేష జీవితములను గురుసేవలోనే గడిపి శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు.

విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

ఒకసారి ఇంట్లో వస్తువులన్నీ నిండుకున్నాయి. శ్రీరామనవమి దగ్గర పడుతోంది. ఇంట్లో ధాన్యపు గింజలేదు. శ్రీరాముడికి గోధుమపిండితో బొబ్బట్లు చేసిపెట్టాలని రేణుబాయి సంకల్పం. నారాయణ తల్లి ఆవేదన గ్రహించాడు. “అమ్మా! మన ధాన్యంగదిలో ఎంత ధాన్యం ఉందో చూద్దాం పద?” అన్నాడు. “ఒరే నారాయణా! బుట్టెడు గోధుమలు కూడా లేవురా, చూస్తే రామనవమి దగ్గర పడుతోంది” అంది ఆమె. “ముందు చూద్దాం పద!” అని ధాన్యపు గదిలోకి దూరాడు. అంతా చీకటి. తల్లికి నిండిన గోధుమల బుట్ట అందిస్తూ, “ఇవి ఎండలో పోసి రా!” అన్నాడు. ఆమె తిరిగి వచ్చేసరికి ఇంకో బుట్ట నింపి ఇచ్చాడు. ఇలా ఆమె మధ్యహ్నం దాకా మోసి మోసి అలసిపోయింది. తల్లి ఆశ్చర్యపోయింది. ధాన్యం కొరత తీరింది. రామనవమి చక్కగా జరిగింది.

ఒకనాడు తల్లి కోపగించుకున్నదని నారాయణ ఎటో వెళ్ళిపోయాడు. చీకటి పడేదాకా వెతికారు. చివరకు ఊరి చివర చెరువు గట్టున కూర్చుని ఉన్నాడు. తల్లి బాధతో “ఒరేయ్! ఒక్క మాట అంటే అలిగి వెళ్ళిపోతే నేను ఏం అయిపోవాలి? అంది. “అమ్మా! నేను అలిగితే ఓదార్చడానికి మీరు ఉన్నారు. నా ఆకలి తీర్చటానికి మీరు ఉన్నారు. కాని లక్షలాది అన్నార్తుల బాధలు వినటానికి ఎవరు ఉన్నారమ్మా! వారి గురించి నేను ఆలోచిస్తున్నాను” అన్నాడు.

ఒక రోజు నారాయణ అన్నగారిని మంత్రోపదేశం చేయమన్నాడు. “నీవు చిన్నవాడవు నీకు తగిన వయస్సు, సమయం రానీ!” అన్నాడు అన్నయ్య. నారాయణ తన ఆరాధ్యదైవమైన హనుమంతుడి గుడికి వెళ్ళి ఆంజనేయుడిని ధ్యానించాడు. ధ్యానంలో మారుతి దర్శనం ఇచ్చి “నాయనా! ఏం కావాలి?” అని అడిగాడు. “నాకు మంత్రం అనుగ్రహించండి” అన్నాడు నారాయణ. “నువ్వు

చిన్నవాడివి కొంతకాలం ఆగ"మని చెప్పి చూశాడు. కాని నారాయణ వదలలేదు. అతని నిర్మలభక్తి చూసి హనుమంతుడు రాముడిని పిలిచాడు. "ఏమిటి మారుతీ పిలిచావు?" అని అడిగాడు రాములవారు. మారుతి రాముల వారికి నమస్కరించి "నా అంశతో ధర్మసంస్థాపన కొరకు జన్మించాడు ఇతడు. అతనికి మంత్రం అనుగ్రహించండి" అన్నాడు. రాముడు "సరే" అని నారాయణను ఒడిలో కూర్చోబెట్టుకుని త్రయోదశాక్షరి మంత్రం ఉపదేశించాడు. ధనుర్బాణాలు, జపమాల, కాషాయవస్త్రాలు, రామ నామాంకితమైన సువర్ణమంత్రం ఇచ్చి "కలి ప్రధమపాదంలో మ్లేచ్ఛ సంహారార్ధం శివాంశతో శివాజీ అనే రాజు జన్మిస్తాడు. అతడికి నువ్వు రామదీక్షను ఇచ్చి అతడిని ధర్మసంస్థాపన కొరకు వినియోగించుకోవాలి. ఇకనుండి నువ్వు 'రామదాస్' అని పిలవబడతావు" అని ఆశీర్వదించి అంతర్ధనమయ్యారు. ఇది 1538 నలనామ సంవత్సర శ్రావణ శుద్ధ అష్టమినాడు జరిగింది.

అన్నయ్య మంత్రోపదేశం చేయలేదన్న కోపంతో నారాయణ మళ్ళీ ఎక్కడకు అలిగి వెళ్ళాడో అని అంతటా వెతికారు. హనుమంతుడి గుడిలో కనిపించాడు. చేతిలో జపమాల, ధనుర్బాణం, కాషాయ వస్త్రం చూసి శ్రేష్ఠుడికి అర్ధం అయింది, తమ్ముడికి రామానుగ్రహం కలిగింది అని. నారాయణ రామధ్యానంలో దినాలు గడిపేస్తున్నాడు. హనుమంతుడితో ఆకలిదప్పులు మరచి ముచ్చటిస్తున్నాడు. ఇంటికి ఎప్పుడు వస్తాడో, ఏం తింటాడో తెలియదు. తల్లికి ఆవేదనగా ఉంది. సంసారం మెడలో పడితే దారికి వస్తాడని అనుకుంది. పెళ్ళి అన్న మాట వినగానే ప్రక్కన ఉన్న నీటి గోతిలో దూకాడు. ప్రక్కనే రాయి తలకి తగిలి తల బొప్పికట్టింది. ఆ బొప్పి జీవితాంతం ఉండి పోయింది.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

# శ్రీ కాళీగార్డెన్స్‌లో శ్రీ దేవీనవరాత్రి ఉత్సవ దృశ్యములు



తీర్థ స్వీకరణ

భీమవరం బాలికలచే కోలాటం ప్రదర్శన





కోలాటం ప్రదర్శించిన బాలికలతో శ్రీ మాతాజీ

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No.: 37804/1981
Postal Regd. No. : GTR/27/2021-2023

# శ్రీ కాళీగార్డెన్స్‌లో శ్రీ దేవీనవరాత్రి ఉత్సవ దృశ్యములు



శ్రీ సద్గురు పాదపూజ



రథోత్సవం

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.